**సూపర్ కనోలీ సూపర్ షో**

గుజరాత్‌పై పంజాబ్ థ్రిల్లింగ్ విక్టరీ




# మానేరు జనత ®

తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక



సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..
శ్రేయోభిలాషులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్



1.4.2026 బుధవారం Wednesday | సంపుటి (Volume): 10 సంచిక (Issue) : 341 | పేజీలు : 8 Pages : 8 | వెల : 2 | Published from : Karimnagar


## సంక్షేమ పథకాలను ప్రజలకు

# వివరించాలి

## ఏప్రిల్ 2 నుంచి పెద్ద ఎత్తున గ్రామసభలు

**రైతు భరోసా లబ్దిదారుల పేర్లు చదవాలి**

**జూన్ 2నుంచి అందరికీ జీవితబీమా అమలు గురించి వెల్లడించాలి**

**నిధుల విడుదల వివరాలు చెప్పాలి**

**ప్రజాపాలన - ప్రజాప్రణాళికపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



**జనతా న్యూస్, హైదరాబాద్ :** ప్రజా పాలన –ప్రజా ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ప్రజా పాలన –ప్రజా ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2 నుంచి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న గ్రామసభలను పెద్ద ఎత్తున నిర్వహించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన ప్రజాభవన్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు. గ్రామ సభలు నిర్వహించే క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఒకే తరహాలో నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్లను డిప్యూటీ సీఎం ఆదేశించారు. మొదట ముఖ్యమంత్రి సందేశం వినిపించి ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పెద్ద ఎత్తున చదివి వినిపించాలని సూచించారు. రైతు భరోసా లబ్దిదారుల పేర్లు, 200 యూనిట్ల విచిత విద్యుత్తు, ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల జాబితాను సాధ్యమైనంతవరకు గ్రామ సభలో చదివి వినిపించాలని ఆదేశించారు. ఇప్పటివరకు ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మరియు జూన్ 2 నుంచి అందరికీ జీవిత బీమా అమలు చేయబోతున్న విషయాన్ని

మిగతా 2 లో

## మూసీపై ఆన్‌లైన్లో ప్రజాభిప్రాయ సేకరణ

**నిర్వాసితులు, డిఫెన్స్ భూములపై సంప్రదింపులు**

**విలువైన సూచనలు చేసిన వారితో సబ్ కమిటీ భేటీ**

**24 గంటలూ అందుబాటులో కేబినెట్ సబ్ కమిటీ**

**డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడి**



# మీ ఆయిల్ మీరే తెచ్చుకోండి!

**బ్రిటన్, ఫ్రాన్స్ తదితర మిత్ర దేశాలపై ట్రంప్ ఆగ్రహం**

**ఇకపై ఆ దేశాలకు అమెరికా సాయం అందదని హెచ్చరిక**

**ఇస్ఫహాన్ పై వెయ్యి కేజీల బంకర్ బస్టర్‌తో దాడి**

**ఇరాన్ సైనిక కేంద్రంపై విరుచుకు పడిన అమెరికా**

**ఇరాన్ ఓడే వరకూ యుద్ధం చేయాలని ట్రంప్ను పట్టుపడుతున్న గల్ఫ్ దేశాలు**

**ట్రంప్ యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్న 61 శాతం మంది అమెరికన్లు**

వివరాలు 4 లో

ఇరాన్పై దాడులలో అమెరికాకు సహాయం చేయని దేశాలపై అధ్యక్షుడు ట్రంప్ ఉ క్రోశం వెళ్లగక్కారు. మీ చమురు మీరు తెచ్చుకోండని హెచ్చరించారు. ఆయన మంగళవారం తన సొంత సోషల్ మీడియా ట్రూత్లో తనకు అండగా నిలవని దేశాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ దేశాలు తనకు ఎలా అండగా నిలువలేదో, అలాగే ఆ దేశాలకు ఇకపై అమెరికా సహాయం అందించదని స్పష్టం చేశారు. ఇరాన్ ను నిర్వీర్యం చేయడంలో పాలుపంచుకోవడానికి నిరాకరించిన దేశాలు, అమెరికా నుండి చమురు కొనుగోలు చేయాలి లేదా హార్మూజ్ జలసంధి గుండా వెళ్లి దాన్ని తీసుకోవాలని అన్నారు.

## 31వ రోజుకు చేరుకున్న ఇరాన్ యుద్ధం

**సెకనుకు సుమారు 9.8 లక్షలు ఖర్చు చేస్తున్న అమెరికా**

**ఇరాన్‌పై అమెరికా భీకర దాడులు**

**ఆయుధ నిల్వల డిపోపై దాడి**

04

## పసుపు రైతులకు ప్రభుత్వం భరోసా

**తడిసిన పసుపు కొనుగోళ్లకు నిర్ణయం**

**మార్కెట్‌యార్డు అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం**



పసుపు రైతులకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. తేమ కలిగిన పసుపును కోతలు లేకుండా కొనుగోలు చేస్తామన్నారు.

02




## మార్జిన్ కోసం చికెన్ దుకాణాదారుల ఆందోళన

నేటి నుంచి బంద్ పాటిస్తామని ప్రకటన

.. వివరాలు 2లో



## శ్రీశైలంలో అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి

**నిబంధనలు ఉల్లంఘిస్తున్న ఏపీ ప్రభుత్వం**

**మండిపడ్డ మంత్రి జూపల్లి కృష్ణారావు**

02

## అసెంబ్లీలో సమస్యలు చర్చకు రాకుండా చేశారు

**కేరళ ప్రచారం కోసం 30ననే అసెంబ్లీ వాయిదా**

**కాళేశ్వరంపై కేంద్రమంత్రి వ్యాఖ్యలు సరికావు**

**మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నేత హరీష్ రావు**



ప్రజా సమస్యలు చర్చకు రాకుండా వివిధ కారణాలతో అసెంబ్లీ సమయాన్ని వృధా చేశారని మాజీ మంత్రి, డిప్యూటీ ఎలోర్ లీడర్ హరీష్ రావు అన్నారు. అసెంబ్లీని ఇష్టం వచ్చినట్లు నడిపారని.. అసెంబ్లీలో టీ బ్రేక్ అని చెప్పి, ముఖ్యమంత్రి ఢిల్లీ నుండి వస్తున్నాడని ఒకరోజు, కేరళ నుండి వస్తున్నాడని ఒకరోజు.. నాలుగు గంటలు వృథా చేశారన్నారని ఆరోపించారు.

03

## ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు

**4వ తేదీన విచారణకు హాజరు కావాలని ఆదేశాలు**



# ట్యాంక్ బండ్ శివకు 5లక్షల ఆర్థిక సాయం

## అందచేసిన సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,మార్చి31 :** ట్యాంక్ బండ్ శివకు ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాయం అందించారు. కుటుంబానికి రూ.5 లక్షలు ఆర్థికసాయంతో పాటు అతని కుమారుడు వేణుమాధవ్ కు హోం గార్డు ఉద్యోగ నియామకపత్రం అందజేసారు. ట్యాంక్ బండ్ పై ఎంతో మంది ప్రాణాలను కాపాడిన శివ గురించి ఇటీవల ముఖ్యమంత్రి దృష్టికి చేరింది. ట్యాంక్ బండ్ శివ దీన పరిస్థితిని అర్థం చేసుకున్న సిఎం అతడిని ఆదుకోవడానికి నిర్ణయించారు. ఉపాధి లేక కుటుంబ పోషణ భారమై ఇబ్బందులు పడుతున్న ట్యాంక్ బండ్ శివకు ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించారు. ట్యాంక్ బండ్ శివకు అవసరమైన సాయం అందించాలని కొద్ది రోజుల క్రితం అధికారులను ఆదేశించారు. ఉపాధి కోసం ట్యాంక్ బండ్ సమీపంలో ఒక స్విమ్మింగ్ పూల్ నిర్మించి ఇవ్వాలని ట్యాంక్ బండ్ శివ కోరారున ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను సిఎం ఆదేశించారు. శివ కుటుంబానికి డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. సీఎం చేతులమీదుగా సాయం అందుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేసిన ట్యాంక్ బండ్ శివ, కుటుంబసభ్యులు.

# మార్జిన్ కోసం చికెన్ దుకాణాదారుల ఆందోళన

## నేటి నుంచి బంద్ పాటిస్తామని ప్రకటన

**హైదరాబాద్,మార్చి31 :** తెలంగాణలో నేటి నుంచి చికెన్ దుకాణాలు బంద్ కానున్నాయి. పౌల్ట్రీ కంపెనీలు మార్జిన్‌లు పెంచే వరకు నిరవధిక బంద్ పాటిస్తామని చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ హెచ్చరించింది. గతంలో కంటే మార్జిన్ ఇప్పుడు తక్కువగా ఇస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో పౌల్ట్రీ వాళ్లు రిటైల్ దుకాణాలకు కిలోకు రూ.26 మార్జిన్ ఇచ్చేవారని, గత ఇరవై ఏళ్లుగా ఇదే మార్జిన్ ఇస్తున్నారని, ఇటీవల ఈ మార్జిన్ రూ.16 కు తగ్గించారని దుకాణ యజమానులు ఆందోళన వ్యక్తంచేశారు. కేజీ చికెన్ మార్జిన్ రూ.30 ఇవ్వాలని ఓనర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. అందుకే మార్జిన్ పెంచే వరకు రేపటి నుంచి నిరవధిక బంద్‌కు పిలుపునిస్తున్నట్లు తెలిపింది. ప్రస్తుతం చికెన్ విక్రయాలపై వస్తున్న లాభాలు తక్కువగా ఉండటంతో షాపులు నిర్వహించడం కష్టంగా మారినట్లు అసోసియేషన్ నాయకులు చెబుతున్నారు. తక్కువ మార్జిన్ వల్ల వ్యాపారుల జీవనోపాధి సవాల్‌గా మారిందని అంటున్నారు. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు నిరసన కొనసాగుతుందని తెలిపారు.

# పసుపు రైతులకు ప్రభుత్వం భరోసా

## తడిసిన పసుపు కొనుగోళ్లకు నిర్ణయం

## మార్కెట్‌యార్డు అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం



**హైదరాబాద్,మార్చి 31 :** పసుపు రైతులకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. తేమ కలిగిన పసుపును కోతలు లేకుండా కొనుగోలు చేస్తామన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దన్నారు. రైతులను ఇబ్బంది పెడితే మార్కెట్ అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిజామాబాద్ మార్కెట్‌కు పసుపు భారీగా వస్తోంది. 1,500 టార్పాలిన్ల పంపిణీ కోసం బిడ్డింగ్ పూర్తి చేశాం. పసుపు కొనుగోళ్లు వేగంగా చేపట్టాలని అధికారులను ఆదేశించాం. మేలు రకం పసుపు పంటకు ప్రభుత్వం ఖరారు చేసిన ధర చెల్లిస్తున్నాం. రైతులకు చెల్లింపులు సక్రమంగా జరగాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశాం అని తుమ్మల పేర్కొన్నారు. మంగళవారం నాడు మీడియాతో మాట్లాడిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు...ఈ మేరకు పసుపు రైతులకు ఊరటనిస్తూ కీలక ఆదేశాలు జారీ చేశారు. అకాల వర్షాలతో పసుపు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని చెప్పారు. తడిసిన పసుపును కోతలు లేకుండా కొనుగోలు చేయాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. తేమ పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దని అధికారులను హెచ్చరించారు. మార్కెట్ యార్డు అధికారులు రైతులను ఇబ్బంది పెడితే.. కఠిన చర్యలు తీసుకుంటామంటూ మంత్రి తుమ్మల వార్నింగ్ ఇచ్చారు. . నిజామాబాద్ మార్కెట్‌కు భారీగా పసుపు వచ్చిందన్నారు. 4,500 కుప్పలు (27,400 బస్తాలు) యార్డుకు చేరిందన్నారు. 500 కుప్పలు బహిరంగ ప్రదేశాల్లో నిల్వ ఉందని చెప్పిన మంత్రి.. పసుపు రక్షణకు 1,500 టార్పాలిన్‌లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. గాలులు, వర్షాలతో 70 - 80 కుప్పలు తడిశాయన్నారు. దీని కారణంగా దాదాపు 40 మంది రైతులకు నష్టం వాటిల్లిందన్నారు. తడిసిన పసుపును పూర్తి తూకంతో కొనుగోలు చేయాలని మార్కెట్ యార్డ్ అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు.

# శ్రీశైలంలో అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి

## నిబంధనలు ఉల్లంఘిస్తున్న ఏపీ ప్రభుత్వం.. మండిపడ్డ మంత్రి జూపల్లి కృష్ణారావు

**హైదరాబాద్,మార్చి31 :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీశైలం నుంచి అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తోందంటూ మంత్రి జూపల్లి కృష్ణారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. దీంతో వేసివి నీటికి కటకట ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. శ్రీశైలం ప్రాజెక్టులో పవర్ జెనరేషన్ చేయొద్దని నిబంధన ఉందని.. ట్రయిల్స్ చేయొద్దని జీవో కూడా ఉందని అన్నారు. తాగునీటి కోసం మాత్రమే వినియోగించాలని సమైక్య రాష్ట్రంలో ఇచ్చిన జీవో స్పష్టంగా ఉందని మంత్రి జూపల్లి అన్నారు. తెలంగాణ హైకోర్టులో గతంలో పిల్ ఫైల్ కూడా చేశామని..జస్టిస్ పినాకి గోష్ ఇచ్చిన తీర్పు కూడా ఉందని అన్నారు. కరెంటు ఉత్పత్తి చెయ్యడానికి వీలు లేదని అన్నారు. దొంగతనంగా కరెంటు తీసుకోవాల్సిన ఖర్మ ఏపీకి ఎందుకని అన్నారు మంత్రి జూపల్లి. ధర్నా చేస్తామని చెప్పడంతో ఏపీ ప్రభుత్వం పంపింగ్ ఉపసంహరణ చేసుకుందని అన్నారు. పాలమూరు రైతాంగం, ప్రజలకు అండగా కాంగ్రెస్ పార్టీ ఉంటుందని స్పష్టం చేశారు. వాటర్ అలకేషన్ అంశం కోర్ట్ లో పెండింగ్ లో ఉందని... 69 శాతం తెలంగాణకు 31 శాతం ఆంధ్రకు వాటా రావాల్సి ఉందని అన్నారు. ప్రభుత్వం మన రాష్ట్ర హక్కును కాపాడుతుందని.. అక్రమంగా నీటిని తరలిస్తే ప్రజల పక్షాన కాంగ్రెస్ పోరాటం చేస్తోందని అన్నారు. మంత్రి జూపల్లి వ్యాఖ్యలతో ఏపీ తెలంగాణ మధ్య నీటి వివాదం మరోసారి తెరపైకి వచ్చింది.

# సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

మొదటి పేజీ తరువాయి

వివరించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారం ఆ కార్యక్రమంలో భాగంగా మూడు రోజులపాటు గ్లాస్ పాలు, మూడు రోజులపాటు రాగి జావా అందిస్తున్న విషయాన్ని వివరించాలన్నారు. ఇంటర్ కళాశాలల విద్యార్థులకు కొత్తగా మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్న విషయం అందరికీ తెలిసేలా వివరించాలన్నారు. వీటిని వివరించే క్రమంలో సాంస్కృతిక శాఖ, పౌర సంబంధాల శాఖ సహాయ సహకారాలు తీసుకోవాలన్నారు. గ్రామపంచాయతీలకు పెద్ద ఎత్తున నిధులు విడుదల చేస్తున్నాం, గ్రామాల వారిగా విడుదలైన నిధుల వివరాలను అందుబాటులో పెట్టుకుని గ్రామసభ రోజు ఆ గ్రామానికి ఎంత చేరిందో ప్రకటించాలి అన్నారు. ÷-రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతం అవుతున్న తీరును ఎప్పటికప్పుడు చీఫ్ సెక్రటరీ మరియు ప్రణాళికా శాఖ జిల్లా కలెక్టర్ ల నుంచి సమాచారం సేకరిస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకే పరిమితం కాదు మౌలిక సదు-పాయాల అభివృద్ధి, సేవా రంగాన్ని అభివృద్ధి చేస్తూ ముందుకు పోతున్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు.



# మూసీపై ఆన్‌లైన్లో ప్రజాభిప్రాయ సేకరణ

## నిర్వాసితులు, డిఫెన్స్ భూములపై సంప్రదింపులు

## విలువైన సూచనలు చేసిన వారితో సబ్ కమిటీ భేటీ

## 24 గంటలూ అందుబాటులో కేబినెట్ సబ్ కమిటీ

## డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడి

**హైదరాబాద్,మార్చి31 :** మూసీ పునరుజ్జీవ పనులను ప్రజాస్వామ్యయుతంగా చేపడుతున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. మూసీపై ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ సమావేశం సోమవారం సచివాలయంలో జరిగింది. మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.మార్చి 31 నుంచి ఏప్రిల్ 15 వరకు ఆన్ లైన్ లో మెయిల్ ఐడీ ద్వారా మూసీ పునరుజ్జీవంపై ప్రజల అభిప్రాయాలు స్వీకరిస్తామని తెలిపారు. ఆన్ లైన్ లో వచ్చిన విలువైన సలహాలు, సూచనలను అన్నింటినీ అధికారులతో కలిసి విశ్లేషణ చేస్తామని చెప్పారు. అభిప్రాయాలు వెల్లడించిన వారితో నేరుగా దశలవారీగా సబ్ కమిటీ సభ్యులు సంప్రదింపులు చేస్తారని డిప్యూటీ సీఎం తెలిపారు. మూసీ నది ఒడ్డున ఓంకారేశ్వర ఆలయం పనులకు మార్చి 28న శంకుస్థాపన జరిగిందని, ఆ రోజు నుంచి మూసీ ఫేస్ 1, ఫేస్ 2 వరకు చేయాల్సిన పనులకు సంబంధించిన రోడ్ మ్యాప్ ను సిద్ధం చేసుకోవాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. డిఫెన్స్ భూములు, మూసీ నిర్వాసితులతో సంప్రదింపులు, నిర్మాణ డిజైన్లు తుది దశకు తీసుకురావడం, బ్యాంకర్స్ తో మాట్లాడటం ఇలా పనులను ఎక్కడికి అక్కడ విభజన చేసుకొని ముందుకు వెళ్లాలని అధికారులకు సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి యావత్ కేబినెట్ సంకల్పాన్ని అర్థం చేసుకొని అధికారులు ఉత్సాహంగా ముందుకు వెళ్లాలని అన్నారు.

ఈ ప్రాజెక్టు ఒక మైలురాయిగా నిలుస్తుందని అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. అధికారులకు ఎలాంటి సలహా, సూచన ఇతర ఏ అవసరాలు ఉన్న సబ్ కమిటీ సభ్యులు 24 గంటల పాటు అందుబాటులో ఉంటారని తెలిపారు. సమావేశంలో స్పెషల్ సీఎస్ జయేశ్ రంజన్, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండీ ఈవీ నరసింహారెడ్డి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, అధికారులు వినయ్ కృష్ణారెడ్డి, అశోక్ రెడ్డి, కలెక్టర్లు హరిచందన, నారాయణరెడ్డి, మను చౌదరి, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో జయలలిత ఇల్లు సీజ్

## ఇంటిపన్ను చెల్లించకపోవడంతో చర్యలు

**హైదరాబాద్,మార్చి31 :** తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, దివంగత జయలలితకు చెందిన ఇల్లు సీజ్ చేశారు. ఇంటిపన్ను బకాయిలు చెల్లించకపోవడంతో ఈ చర్య తీసుకున్నారు. హైదరాబాద్‌లో ఉన్న ఆమె ఇంటిని జీహెచ్ఎంసీ అధికారులు సోమవారం సీజ్ చేశారు. శ్రీనగర్ కాలనీలో ఉన్న ఆమె ఇంటికి సంబంధించిన ఆస్తి పన్ను బకాయిలు చెల్లించకపోవడంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. జీహెచ్ఎంసీ అధికారులు ఫిబ్రవరిలోనే ఆస్తిపన్ను బకాయిలపై నోటీసులు జారీ చేశారు. అయితే జయలలితకు సంబంధించివారి నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఈ క్రమంలో శ్రీనగర్ కాలనీలో ఉన్న జీ4 భవనాన్ని సీజ్ చేశారు. ఈ ఇంటికి సంబంధించి 2017 నుంచి సుమారు రూ.83 లక్షల ఆస్తి పన్ను బకాయిలు ఉన్నాయని సమాచారం. సోమవారం జీహెచ్ఎంసీ ఏఎంసీ బాల్‌రాజ్ ఆధ్వర్యంలో సిబ్బంది జయలలిత ఇంటిని సీజ్ చేశారు. మార్చి 31 వరకు ఓటీఎస్ స్కీమ్ అందుబాటులో ఉందని, ఆ రాయితీ పోగా మొత్తం రూ.82,91,822 మేర బకాయిలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. జయలలి తకు సంబంధించిన ఈ భవనంలో గతంలో ప్రైవేట్ కార్యాలయాన్ని నిర్వహించారు. అయితే ఈ భవనాన్ని 2017 నుంచి నివాసానికి వాడుకుంటున్నామని.. కాబట్టి రెసిడెన్షియల్‌గా మార్చాలని జీహెచ్ఎంసీ అధికారుల్ని జయలలిత మేనల్లుడు, చెన్నైకి చెందిన దీపక్ జయకుమార్ గతంలో కోరారు.

# పాతబస్తీలో కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ

## దాడిచేసి సీజ్ చేసిన పోలీసులు

**హైదరాబాద్,మార్చి31 :** నగరంలో కలుషిత ఆహార పదార్థాల తయారీపై పోలీసులు మరోసారి కఠిన చర్యలు తీసుకున్నారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కాటెదాన్ పారిశ్రామిక ప్రాంతంలో నాసిరకం అల్లం-వెల్లుల్లి పేస్ట్ తయారు చేసి విక్రయిస్తున్న కేంద్రంపై కమిషనర్ టాస్క్‌ఫోర్స్ , హెచ్-ఫాస్ట్ బృందం సంయుక్తంగా ఆకస్మిక దాడి నిర్వహించింది. పక్కా సమాచారంతో పోలీసులు ఐడీఏలోని తయారీ సంస్థ పై దాడి చేశారు. ఈ సందర్భంగా హసన్ అలీ రూపానీ (55) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు అబిడ్స్ ప్రాంతానికి చెందినవాడిగా గుర్తించారు. తనిఖీల్లో ఫుడ్ ప్రాసెసింగ్ కేంద్రంలో తీవ్ర అపరిశుభ్ర పరిస్థితులు వెలుగుచూశాయి. ప్లాస్టిక్ డబ్బాల్లో, పరిశుభ్రతకు విరుద్ధంగా పేస్ట్ తయారు

చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నాణ్యత లేని అల్లం, వెల్లుల్లి తొక్కలను ఉపయోగించి పేస్ట్ తయారు చేస్తున్నట్లు వెల్లడైంది. పేస్ట్ తయారీలో ఎసిటిక్ యాసిడ్, గమ్ పౌడర్ వంటి రసాయనాలు కలుపుతున్నట్లు అధికారులు గుర్తించారు. తయారు చేసిన పేస్ట్‌ను బహిరంగ ప్రదేశాల్లో నిల్వ చేయడంతో దుమ్ము, ఈగలు వాలినట్లు పోలీసులు తెలిపారు. ఈ పేస్ట్‌ను హోల్‌సేల్ కిరాణా దుకాణాలు, క్యాటరింగ్ సర్వీసులకు సరఫరా చేస్తూ ప్రజల ఆరోగ్యంతో నిందితుడు చెలగాటం ఆడుతున్నాడని పేర్కొన్నారు. ఫుడ్ సేఫ్టీ సర్టిఫికేట్ లేకుండానే లాభాపేక్షతో ఈ అక్రమ వ్యాపారం సాగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. దాడిలో సుమారు రూ.22 లక్షల విలువైన సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 4,032 కిలోల అల్లం-వెల్లుల్లి పేస్ట్, 6,000 కిలోల నాసిరకం వెల్లుల్లి, 210 కిలోల నాసిరకం అల్లం, వెల్లుల్లి పొట్టు సంచులు, 250 కిలోల ఉప్పు, ఎసిటిక్ యాసిడ్, గ్జాంతమ్ గమ్ పౌడర్, 5 గ్రైండింగ్ యంత్రాలు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన నిందితుడిని, స్వాధీనం చేసిన సామగ్రిని తదుపరి విచారణ కోసం మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు అప్పగించారు.

# స్టడీ హాల్‌ను ప్రారంభించిన మంత్రి

**హైదరాబాద్,మార్చి31 :** మల్కాజ్ గిరి నియోజకవర్గంలోని గ్రీన్ హిల్స్ కాలనీలో రాధా స్టడీహాల్‌ను రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, ఇతర ముఖ్య నేతలతో కలిసి మంత్రి రిబ్బన్ కట్ చేసి ఈ స్టడీహాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ... నగరంలోని రద్దీ ప్రాంతాల్లో విద్యార్థులకు చదువుకోవడానికి ప్రశాంతమైన వాతావరణం అవసరమని, అటువంటి చక్కని వసతులతో ఈ స్టడీహాల్‌ను అందుబాటులోకి తెచ్చిన నిర్వాహకులు రాధా రవి దంపతులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.స్టడీహాల్‌లోని వసతులను పరిశీలించిన మంత్రి, అక్కడ చదువుకుంటున్న విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని, విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు.అనంతరం, బస్ స్టాండ్ సమీపంలో ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, విప్లవ వీరులు మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు మంత్రిలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

# నిజామాబాద్ జిల్లాలో అకాల వర్షం

## తడిసి ముద్దయిన వరి, పసుపు పంటలు

**నిజామాబాద్, మార్చి 31 :** జిల్లాలో సోమవారం అర్ధరాత్రి నుంచి కురుస్తున్న అకాల వర్షాలకు పలుచోట్ల పంటలు దెబ్బతిన్నాయి. ప్రధానంగా వరి, మామిడి పంటలకు తీవ్ర నష్టం జరిగినట్లు తెలుస్తోంది. బాన్సువాడ, బోధన్ నియోజకవర్గాల్లో వరి కోతలు చురుగ్గా సాగుతున్నాయి. చేతికి వచ్చిన ధాన్యాన్ని ఆరబోయగా తడిసి ముద్దవ్వడంతో రైతులు లబోదిబోమంటున్నారు. కోటగిరి, పోతంగల్, బోధన్, ఎడపల్లి ధర్పల్లి, సిరికొండ మండలాల్లో కోతకు వచ్చిన వరి నేల వాలింది. జుక్కల్, బిచ్కుంద నిజాంసాగర్ మండలాల్లో పంట నష్టం వాటిల్లింది. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్లో అకాల వానలు పసుపు రైతులను ఇబ్బందికి గురిచేసింది. పసుపు అమ్మేందుకు వచ్చిన రైతులకు నష్టం వాటిల్లింది. ఒకట్రెండు రోజుల్లో పసుపును అమ్మేందుకు రైతులు సిద్ధమవుతుండగా పసుపు కుప్పలు వరద నీళ్లలో మునిగిపోయాయి. ఇదిలావుంటే ఇంకా కొన్నిచోట్ల పంటలు కోతకు రాలేదు. విద్యుత్ సరఫరా సరిగా ఉండడం లేదని పలువురు రైతులు వాపోయారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్తు సమస్యలు రోజురోజుకూ మరింత తీవ్రమవుతున్నాయి. ఒకవైపు రాత్రిపూట కరెంట్ సరఫరా చేస్తుండడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతుంటే, మరో వైపు పగటిపూట లో వోల్టేజీ కారణంగా ప్రజలు సతమతమవుతున్నారు. ప్రస్తుతం ఎండలు ముదిరిన తరుణంలో నిరంతర కరెంట్ సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు. గతంలో సుమారు 18 గంటల వరకు త్రీఫేజ్ కరెంట్ సరఫరా చేసే వారు. అయితే, ఇప్పుడది 12 గంటల నుంచి 16 గంటల్లోపే పరిమితం కావడం, మరోవైపు సాంకేతిక కారణాల వల్ల సరఫరాలో తరచూ అంతరాయాలు ఏర్పడుతుండడం సాగుకు ఇబ్బందికరంగా మారిందని రైతులు వాపోతున్నారు. అర్ధరాత్రి 12 గంటలకు కరెంట్ ఇస్తుండడంతో నిద్ర కరువవుతున్నదని చెబుతున్నారు.

# నగరంలో కల్తీ నూనె దందా

## వాడేసిన నూనె ప్యాకెట్లలో నింపి అమ్మకం

## ముఠాను గుర్తించి పట్టుకున్న పోలీసులు

**హైదరాబాద్,మార్చి31 :** హైదరాబాద్‌లో కల్తీ వంట నూనె దందా తీవ్ర కలకలం రేపుతోంది. హైటెక్ సిటీలో కల్తీ వంట నూనె విక్రయాలు జోరుగా సాగుతున్నాయన్న సమాచారం వెలుగులోకి వచ్చింది. హోటళ్లలో వాడిన వంటనూనెను కిలోకు రూ.20కు సేకరిస్తున్న ముఠా... దాన్ని వీధి వ్యాపారులకు రూ.70కు అమ్ముతున్నట్లు బయటపడింది. లాభాల కోసం ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న ముఠా గుట్టు బయటపడింది. నాచారం ప్రాంతంలో శుద్ధి పేరుతో మళ్లీ ప్యాకెట్లలో నింపుతూ దందా చేస్తున్నట్లు గుర్తించారు. సమాచారం అందిన వెంటనే రంగంలోకి దిగిన మాదాపూర్ పోలీసులు... కల్తీ నూనె సేకరిస్తున్న వ్యక్తులను అరెస్ట్ చేశారు. మాదాపూర్, గచ్చిబౌలి ప్రాంతాల్లోని రెస్టారెంట్ల నుంచి వాడిన నూనెను సేకరించి.. కర్ణాటక రిజిస్ట్రేషన్ ఆటోలో వందల లీటర్లు తరలిస్తున్న ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సుమారు 20 డబ్బాల్లో కల్తీ నూనెను గుర్తించారు. నిందితులు సరైన పత్రాలు చూపించలేక తప్పించుకునే ప్రయత్నం చేశారు. చివరకు వీధి వ్యాపారులకు కల్తీ వంట నూనెను అమ్ముతున్నట్లు పోలీసుల ఎదుట ఒప్పుకున్నారు.

# అసెంబ్లీలో సమస్యలు చర్చకు రాకుండా చేశారు

## కేరళ ప్రచారం కోసం 30ననే అసెంబ్లీ వాయిదా
## కాళేశ్వరంపై కేంద్రమంత్రి వ్యాఖ్యలు సరికావు
## మీడియా సమావేశంలో బిఆర్ఎస్ నేత హరీష్ రావు



**హైదరాబాద్,మార్చి31 :** ప్రజా సమస్యలు చర్చకు రాకుండా వివిధ కారణాలతో అసెంబ్లీ సమయాన్ని వృధా చేశారని మాజీ మంత్రి, డిప్యూటీ ఎలోర్ లీడర్ హరీష్ రావు అన్నారు. అసెంబ్లీని ఇష్టం వచ్చినట్లు నడిపారని.. అసెంబ్లీలో టీ బ్రేక్ అని చెప్పి, ముఖ్యమంత్రి ఢిల్లీ నుండి వస్తున్నాడని ఒకరోజు, కేరళ నుండి వస్తున్నాడని ఒకరోజు.. నాలుగు గంటలు వృథా చేశారన్నారని ఆరోపించారు. మీడియా సమావేశంలో హరీష్ రావు మాట్లాడుతూ.. ఒకరోజు పెండ్లి ఉందని పోతరు, ఒకరోజు ÷నాన్స్ మినిస్టర్ ప్రిపేర్ అవుతున్నాడని అని సభ ఆపేస్తారు. అసలు సభకు వచ్చి ప్రిపేర్ అవుతారా, ప్రిపేర్ అయ్యాక సభకు వస్తారా..? అని హరీష్ రావు ప్రశ్నించారు. ఒకరోజు విద్యుత్ ఉద్యోగులకు చెక్కులు ఇవ్వాలని 4 గంటలు వృథా చేశారని.. మండిపడ్డారు. కేరళ ఎన్నికల కోసం శాసనసభని 30వ తేదీనే బంద్ పెట్టారు. కేరళ ఎన్నికలు మీకు అవసరం ఏమో..? తెలంగాణ ప్రజలకు, బీఆర్ఎస్ పార్టీకి శాసనసభ ముఖ్యం, ప్రజా సమస్యలు ముఖ్యమని హరీష్ రావు స్పష్టం చేశారు. శాసనసభలో పహిల్వాన్లు అని రేవంత్ రెడ్డి అంటాడు, కత్తులతో తలలు తీసేస్తామని ఇంకో సభ్యుడు అంటాడు. మరి ఇవన్నీ ఎథిక్స్ కమిటీకి రిఫర్ చేయరా..? కాంగ్రెస్ సర్కార్‌ను హరీష్ రావు ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ఎన్నోసార్లు అనాగరిక భాష మాట్లాడాడు, మరి అది రిఫర్ చేయరా ఎథిక్స్ కమిటీకి..? అని అడిగారు. మీరు అసెంబ్లీలో మా గొంతు నొక్కే ప్రయత్నం చేసినా, ప్రజాక్షేత్రంలో మిమ్మల్ని నిలదీస్తూనే ఉంటామని హరీష్ రావు హెచ్చరించారు. రేవంత్ రెడ్డి, సీఆర్ పాటిల్ వ్యాఖ్యలకు మధ్య తేడా లేదని హరీష్ రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వమే అన్ని అనుమతులు ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రులు, సుప్రీంకోర్టు కూడా కాళేశ్వరం చాలా గొప్ప ప్రాజెక్టు అని ప్రశంసించాయి. నితిన్ గడ్కరీ, పీవీ నరసింహన్ లాంటి ఎందరో ప్రముఖులు కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణాకు వరప్రదాయిని అని అన్నారు. ఇటీవల పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం పెట్టిన ఎకనామిక్ సర్వేలో కాళేశ్వరం వల్ల సాగు భూమి విస్తీర్ణత పెరిగిందని చెప్పింది. అసెంబ్లీలో ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా కాళేశ్వరం వల్ల గత రెండేళ్లలో వేల ఎకరాల సాగు భూమి విస్తీర్ణత పెరిగిందని నివేదిక పెట్టాడు. ఆలేరు నియోజకవర్గంలో గంధమల్ల ప్రాజెక్టుకు, మూసీలో తెచ్చే గోదావరి నీళ్లు కాళేశ్వరం నుండి వచ్చేవే కదా అని అన్నారు. సీఆర్ పాటిల్ ఒకసారి తెలంగాణకు వచ్చి ఇక్కడ రైతులను అడిగితే, నీళ్లు ఎప్పుడు వచ్చాయి, ఎలా వచ్చాయని స్పష్టంగా తెలుస్తుందన్నారు. కేవలం బీఆర్ఎస్ పార్టీ మీద బురదజల్లడానికే కాళేశ్వరం గురించి తప్పుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఒక్క రూ.50 కోట్లు ఇస్తే ఇంకొక 2 లక్షల ఎకరాల ఆయకట్టు వస్తుందని, రెండేళ్ల నుండి దాదాపు 20 లేఖలు రాస్తున్నా ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందిస్తలేదని అన్నారు. మీకు మా మీద కోపం ఉంటే తీర్చుకోండి.. కానీ ఆ కోపాన్ని రైతుల మీద చూపకండని హరీష్ రావు విజ్ఞప్తి చేశారు.

# ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి సీఐడీ నోటీసులు

### 4వ తేదీన విచారణకు హాజరు కావాలని ఆదేశాలు



**హైదరాబాద్,మార్చి31 :** బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు పంపింది. జనవరి 29వ తేదీన సమ్మక్క సారక్క జాతర దగ్గర జరిగిన గొడవలో కరీంనగర్ కమిషనర్?పై వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడని పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును సీఐడీకి అప్పగించడంతో ఏప్రిల్ 4వ తేదీన హైదరాబాద్ నగరంలో ఉన్న సీఐడీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని అధికారులు నోటీసులు జారీ చేశారు. విచారణకు హాజరు కావాలని నోటీసులు ఇచ్చారు. హుజురాబాద్ పోలీస్ స్టేషన్ కేసు నంబర్ 30/2026 నమోదైంది. సమ్మక్క సారక్క జాతర సమయంలో రోడ్డుపై బైఠాయించి ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించారనేది కౌశిక్ రెడ్డిపై ఉన్న ఆరోపణ. ప్రజలకు అసౌకర్యం కలిగించారని, పోలీసుల విధులకు అడ్డంకి కలిగించారని, పోలీస్ అధికారులపై అవమానకర వ్యాఖ్యలు చేశాడని కౌశిక్ రెడ్డిపై ఆరోపణలు. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ప్రవర్తించినట్టు కేసు నమోదైంది. ఘటన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఏప్రిల్ 4న ఉదయం 11:30కు విచారణకు హాజరు కావాలని పాడి కౌశిక్ రెడ్డికి నోటీసుల్లో స్పష్టం చేశారు. గుర్తింపు పత్రాలు, సంబంధిత డాక్యుమెంట్లు తీసుకురావాలని.. విచారణకు సహకరించాల్సిందిగా కోరారు. సాక్ష్యాలను చెడగొట్టవద్దని హెచ్చరించారు. నోటీసును పట్టించుకోకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ప్రేమించి పెళ్లి.. కుటుంబ తగాదాలతో ఆత్మహత్య

### యువకుడు మృతి...ఆస్పత్రిలో యువతి

**సిద్దిపేట,మార్చి31 :** ప్రేమించుకుని పెళ్లి చేసుకున్న ప్రేమ జంట ఆత్మహత్యకు పాల్పడింది. పెద్దలకు చెప్పకుండా నామమాత్రంగా పెళ్లి చేసుకున్నారు. వేర్వేరు సామాజికవర్గాలు కావడంతో పెద్దలు అంగీకరించలేదు. ప్రియుడి సోదరి వివాహం పేరు చెప్పి వారిని దూరంగా ఉంచారు. దీంతో మనస్తాపం చెందిన యువతి ఆత్మహత్యాయత్నం చేసింది. పెద్దలు ఇద్దరినీ కలవనివ్వడం లేదని ప్రియుడు ఆత్మహత్యాయత్నం చేయగా, ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ అతను మృతి చెందాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ముస్త్యాల గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ముస్త్యాలకు చెందిన అనుముల రాకేశ్(30) కారు డ్రైవర్. అదేగ్రామానికి చెందిన ఓ యువతి హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తోంది. కొంతకాలంగా వీరు ప్రేమించుకున్నారు. రహస్యంగా నామమాత్రపు పెళ్లి చేసుకున్నారు. తీరా విషయం బయటకు పొక్కడంతో రాకేశ్ కుటుంబీకులు ససేమిరా అన్నారు. అతడి సోదరి వివాహం చేసేంత వరకు కొంతకాలం గడువు కావాలని, పెద్దలసమక్షంలో వివాహం జరుపుతామని హామీ ఇవ్వడంతో ఇరువురు వేర్వేరుగా ఉంటున్నారు. రోజులు గడుస్తున్నప్పటికీ ఎలాంటి స్పందన లేకపోవడంతో మనస్తాపానికి గురైన యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆస్పత్రిలో ఆమె కోలుకుంది. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు రాకేశ్‌తో పాటు అతడి కుటుంబీకులను విచారించారు. మనోవేదనకు గురైన రాకేశ్ పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఆరోగ్యపరిస్థితి క్షీణించడంతో సోమవారం రాత్రి మృతి చెందాడు. రహస్యంగా పెళ్లి చేసుకున్నట్లు ఇరువురూ తెలిపారని, రాకేశ్ తల్లిదండ్రుల నిరాకరణతో ప్రేయసి ఇటీవల ఆత్మహత్యయత్నానికి పాల్పడిందని, ఈవిషయమై దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

# ఇప్పపూవు సారాకు వేల ఏళ్ల చరిత్ర

### దీనిపై మాట్లాడితే దుష్ప్రచారమా?
### మీడియా సమావేశంలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

**హైదరాబాద్,మార్చి31 :** తను ఇప్పపూవు సారా గురించి చెబితే తనపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆరోపించారు. కల్తీసారా తాగకండి అంటే తనను బద్నాం చేస్తారా అంటూ ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులకు ప్రైవసీ అనేది లేకుండా పోయిందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. ఆదివాసీలు లిక్కర్ తయారుచేస్తే తప్పా? కార్పొరేట్ కంపెనీలు చేస్తే కరెక్టా? అని ఆయన ప్రశ్నించారు. ఇప్పసారాకు 3 వేల ఏళ్ల చరిత్ర ఉందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ఇప్పసారా ఇండియన్ లిక్కర్ అని ఆయన అభివర్ణించారు. ఇప్పసారాకు శతాబ్దాల చరిత్ర ఉందని అనిరుధ్‌రెడ్డి ఇటీవల వెల్లడించారు. ఈ రకమైన సారా తాగడం వల్ల ఆరోగ్యానికి మేలు జరుగుతుందన్నారు. గతంలో దీన్ని తాగి 110 ఏళ్లు బతికారని ఆయన వివరించారు. అనిరుధ్ వ్యాఖ్యలపై ప్రజలు తమదైన శైలిలో సోషల్ మీడియా వేదికగా స్పందిస్తున్నారు. ఈ సందర్భంగా సినీతారలపై అనిరుధ్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను డ్రగ్ టెస్ట్ చేయించుకున్నానని.. అలాగే సినీతారలు కూడా టెస్ట్ చేయించుకోవాలని ఆయన సూచించారు. వారిపైనే అధికంగా డ్రగ్స్ ర్యూమర్స్ ఉన్నాయని గుర్తుచేశారు. కానీ రాజకీయ నాయకులపై ఈ పుకార్లు తక్కువేనన్నారు. ప్రతి 90 రోజులకు ఒకసారి డ్రగ్ టెస్ట్ చేయించు కోవాలంటూ సినీనటులకు సూచించారు. డ్రగ్ టెస్ట్‌లో నెగెటివ్ వస్తేనే షూటింగ్స్‌లో పాల్గొనేందుకు అనుమతించాలని ఆయన స్పష్టం చేశారు. డ్రగ్స్ బారినపడిన వారు చిత్ర పరిశ్రమలలోనే అధికంగా ఉన్నారని ప్రజలు భావిస్తున్నారని ఎమ్మెల్యే చెప్పారు. సీఎం రేవంత్ మద్యం, ధూమం వంటివాటికి దూరంగా ఉంటారన్నారు. తాము కూడా డ్రగ్స్‌కు దూరంగా ఉండాలనుకుంటున్నామని అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు.

# ఉచిత బస్సుతో మహిళలకు మేలు

### పదివేల కోట్లు ఆదాచేసిన మహిళలు
### ఆర్టీసీ అభివృద్ధికి అనేక చర్యలు
### మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి



**హైదరాబాద్,మార్చి31 :** తెలంగాణ ప్రజా భవన్ వేదికగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ ప్రగతిపై కీలక ప్రకటన చేశారు. ప్రజా పాలన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని ఆయన గుర్తుచేశారు. డిసెంబర్ 9, 2023న ప్రారంభమైన మహాలక్ష్మి పథకం అద్భుత ఫలితాలను ఇస్తోందని మంత్రి వెల్లడించారు. ఇప్పటివరకు 290 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించి.. దాదాపు 10 వేల కోట్ల రూపాయలను ఆదా చేసుకున్నారని తెలిపారు. మహిళా ప్రయాణికులను కేవలం ప్రయాణికులుగా మాత్రమే కాకుండా, వారిని ఆర్టీసీకి యజమానులను చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రతిరోజూ 65 లక్షల మంది ప్రయాణికుల్లో 40 లక్షల మంది మహిళలే ఉంటున్నారని.. 97 డిపోల పరిధిలో రోజూ 35 లక్షల కిలోమీటర్లు బస్సులు తిరుగుతున్నాయని మంత్రి పొన్నం తెలిపారు. ఈ భారీ లక్ష్యాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్న డ్రైవర్లు, కండక్టర్లకు ఆయన ప్రభుత్వం తరపున ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా రాఖీ వంటి పండుగ దినాల్లోనూ కుటుంబాలకు దూరంగా ఉండి సేవలందించిన కార్మికుల కృషి వెలకట్టలేనిదని కొనియాడారు. ఎలక్ట్రిక్ బస్సుల విషయంలో కొందరు కావాలని తప్పుదోవ పట్టిస్తున్నారని, యూనియన్ల పేరుతో రెచ్చగొట్టే చర్యలను మానుకోవాలని హెచ్చరించారు. తెలంగాణకు ఆర్టీసీయే లైఫ్ లైన్ అని ప్రజల రవాణా అవసరాలను తీర్చడంలో ఆర్టీసీ అగ్రస్థానంలో ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీని రాష్ట్రంలోని ప్రతి మూలకు చేర్చేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామన్నారు. నియోజకవర్గాల వారీగా కొత్త రూట్లు, కొత్త బస్సులు , బస్ స్టేషన్ల అభివృద్ధిపై ప్రజా ప్రతినిధుల నుంచి నివేదికలు తీసుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే హైదరాబాద్‌లో 340 కొత్త రూట్లలో బస్సులను ప్రారంభించామని త్వరలో రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని సర్వీసులు అందుబాటులోకి వస్తాయని స్పష్టం చేశారు. కార్మికుల సంక్షేమంపై స్పందిస్తూ.. బకాయిలను తీరుస్తున్నామని, యూనియన్ల ఏర్పాటు, ఆర్టీసీ విలీనం అంశాలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని మంత్రి పొన్నం వెల్లడించారు.

# 2వ తేదీన శ్రీ హనుమాన్ జయంతి

### హైదరాబాద్‌లో భారీగా శోభాయాత్ర
### సమీక్షించిన వివిధ శాఖల అధికారులు

**హైదరాబాద్,మార్చి31 :** ఏప్రిల్ 2వ తేదీన శ్రీ హనుమాన్ జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్ నగరంలో అత్యంత వైభవంగా 'వీర హనుమాన్ విజయ యాత్ర' నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో గత 22 ఏళ్లుగా కొనసాగుతున్న ఈ భారీ శోభాయాత్ర.. ఈ ఏడాది కూడా కర్మన్ ఘాట్ నుండి ప్రారంభమై గౌలిగూడ రామ్ మందిరం చేరుకుంటుంది. అక్కడి నుండి సికింద్రాబాద్ లోని తాడ్‌బండ్ హనుమాన్ దేవాలయం వరకు ఈ యాత్ర సాగనుంది. ఈ భారీ యాత్రను పురస్కరించుకుని వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ సజ్జనార్, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, వీహెచ్‌పీ / భజరంగ్‌దళ్ నాయకులు పాల్గొన్నారు. యాత్ర సాగే మార్గంలో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుధ్యం, ఇతర మౌలిక వసతుల కల్పనపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశం అనంతరం అధికారులు గౌలిగూడ రామ్ మందిరం నుండి అఫ్జల్ గంజ్ మీదుగా తాడ్ బండ్ వరకు రూట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించి, క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా భజరంగ్‌దళ్, పలు హిందూ సంఘాల నాయకులు పోలీసులకు కొన్ని ముఖ్యమైన విజ్ఞప్తులు చేశారు. గతంలో అబిడ్స్ చౌరస్తా వంటి ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి యాత్రకు ఆటంకం కలిగించారని, ఈసారి అలాంటివి పునరావృతం కాకుండా చూడాలని కోరారు. అలాగే యాత్ర ముగిసే వరకు ఏర్పాటు చేసిన కాషాయ జెండాలను, అలంకరణలను తొలగించవద్దని విన్నవించారు. గణేష్ ఉత్సవాల తరహాలోనే శ్రీరామనవమి, హనుమాన్ జయంతి వేడుకలకు కూడా ఎటువంటి ఆంక్షలు లేకుండా పండుగ వాతావరణంలో జరుపుకునేలా సహకరించాలని అధికారులను కోరారు.

# 2నుంచి గ్రామసభల నిర్వహణ

### కొత్త పథకాలపై ప్రజలకు అవగాహన
### కలెక్టర్లతో సిఎస్ వీడియో కాన్ఫరెన్స్



**హైదరాబాద్,మార్చి31 :** ఏప్రిల్ 2 నుంచి గ్రామ సభలు, వార్డు సభలను కచ్చితంగా నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈ సభలను పారదర్శకంగా నిర్వహించాలని ఆయన సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక అమలు, పురోగతిపై మంగళవారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రామకృష్ణారావు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే తెలియజేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ ప్రకారం ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ప్రజలు అధికంగా పాల్గొనేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, రాష్ట్ర బడ్జెట్‌లో ప్రకటించిన కొత్త పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సభల సందర్భంగా లబ్దిదారుల అభిప్రాయాలను సేకరించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఫీల్డ్ స్థాయిలో అమలు, ప్రజల భాగస్వామ్యం, విభాగాల మధ్య సమన్వయం ఎంతో కీలకమని సిఎస్ పునరుద్ఘాటించారు. కార్యక్రమాన్ని ప్రణాళికాబద్ధంగా సక్రమంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్లను కోరారు. అనంతరం ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ గ్రామ సభలలో అనుసరించాల్సిన కార్యకలాపాల క్రమాన్ని కలెక్టర్లకు వివరించారు. అన్ని జిల్లాల్లో సమావేశాలు ఒకే విధంగా, సమర్థవంతంగా జరగేందుకు నిర్మిత అజెండాను ఆయన వివరించారు. కాగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ / అర్బన్ డెవలప్‌మెంట్ కార్యదర్శి టి.కె. శ్రీదేవి మాట్లాడుతూ వార్డు సభల సందర్భంగా 100 శాతం పన్ను వసూళ్లు సాధించిన మున్సిపల్ సిబ్బందిని సత్కరించాలని సూచించారు. ఇది పట్టణ పాలనలో ఉత్తమ పనితీరును గుర్తించి ప్రోత్సహించడానికి చేపట్టిన చర్య అని ఆమె పేర్కొన్నారు. అనంతరం ఆరోగ్య శాఖ ప్రధాన కార్యదర్శి క్రిస్టినా జోంగ్తు ప్రసంగిస్తూ ఏప్రిల్ 6 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న హెల్త్ వీక్ గురించి కలెక్టర్లకు వివరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఆరోగ్య కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలను నిర్వహించి ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడంపై దృష్టి సారించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ప్రధాన కార్యదర్శి శ్రీధర్, ఇతర ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ముదరుతున్న ఎండలు

### సాయంత్రాలు పలుచోట్ల వర్షాలు

**హైదరాబాద్,మార్చి31 :** రాష్ట్రంలో ప్రస్తుతం భిన్న వాతావరణ పరిస్థితులు నెలకొంటున్నాయి. పగలంతా భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తుండటంతో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతూ ఉక్కపోత, వడగాల్పులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. సాయంత్రం ఆకాశం మేఘాలు కమ్ముకొని ఈదురు గాలులతో కూడిన వర్షం కురుస్తున్నది. హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటన విడుదల చేసింది. సోమవారం ఎండలు మండిపోయి దాదాపు 30 జిల్లాల్లో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వెల్లడించింది. ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసినట్టు తెలిపింది. జగిత్యాల జిల్లా ఆరుట్లలో అత్యధికంగా 41.9 డిగ్రీలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం, మంచిర్యాల జిల్లా కాసీపేట, నల్లగొండ జిల్లా పెద్దవూర, నిజామాబాద్ జిల్లా భీంగల్‌లో 41.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైందని పేర్కొన్నది. వచ్చే 4 రోజులు ఉష్ణోగ్రతలు ఇలానే ఉంటాయని వివరించింది.

# కేరళలో రాహుల్ ఉధృత ప్రచారం

**ఎల్‌డిఎఫ్‌తో బిజెపి కుమ్మక్కు**

**అందుకే శబరిమల ఘటనపై మాట్లాడడం లేదు**

**మరోమారు విమర్శలు గుప్పించిన కాంగ్రెస్ నేత**



**తిరువనంతపురం :** కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో రాహుల్ ప్రచారం ఉధృతం చేశారు. వరుసగా రెండోరోజు ఆయన వివిధ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. అయితే అధికార అధికార లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్, బీజేపీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. సిద్ధాంతాలకు వ్యతిరేకంగా బీజేపీతో ఎల్డీఎఫ్ జత కట్టిందని ఆరోపించారు. అందువల్లే ఈ ఎన్నికల్లో ఎల్డీఎఫ్ గెలవాలని మోదీ కోరుకుంటున్నారని అన్నారు. బీజేపీతో కూడిన ఎల్డీఎఫ్‌కు, కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్‌కు మధ్యే ఎన్నికల పోరాటం జరుగుతోందన్నారు. కన్నూరులో మంగళవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో రాహుల్ మాట్లాడారు. స్వతంత్ర అభ్యర్థులుగా పోటీచేస్తున్న సీపీఎం మాజీ నేతలు వి.కున్హికృష్ణన్, టీవీ గోవిందన్‌లు కూడా రాహుల్ ప్రసంగించిన వేదికపై పాల్గొన్నారు. ఈ ఎన్నికలు రెండు సిద్ధాంతాలకు మధ్య జరుగుతున్న పోరని, తొలిసారి బీజేపీ-లెఫ్ట్ ఫ్రంట్ చేతులు కలపడం అంతా చూస్తున్నామని రాహుల్ అన్నారు. బీజేపీతో ఎల్డీఎఫ్ జత కట్టడం ఇష్టంలేకనే ఆ పార్టీలోని కొందరు సీనియర్లు యూడీఎఫ్ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారని చెప్పారు. లెఫ్ట్ ఫ్రంట్ ఇంకెంతమాత్రం వామపక్ష పార్టీ కాదని,

అతివాద రైట్‌వింగ్ పార్టీ అని పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఎక్కడకు వెళ్లినా ఆలయాలు, మతం గురించి మాట్లాడతారని.. కానీ ఇక్కడకు వచ్చినప్పుడు మాత్రం శబరిమల ఆలయంలో బంగారం తాపడాలు మాయం కావడంపై ఎందుకు మాట్లాడటం లేదని రాహుల్ ప్రశ్నించారు. రాష్ట్రంలో లెఫ్ట్ ఫ్రంట్ తిరిగి గెలవాలని ఆయన కోరుకుంటున్నారని చెప్పడానికి ఇంతకంటే నిదర్శనం లేదని అన్నారు. సీపీఎంను బీజేపీ కంట్రోల్ చేస్తోందని, యూడీఎఫ్‌ను మాత్రం కాదని చెప్పారు. తనకు సవాల్ విసరగలిగే సత్తా కాంగ్రెస్‌కు మాత్రమే ఉందనే విషయం మోదీకి బాగా తెలుసునని అన్నారు. మోదీని కాంగ్రెస్ ప్రతిఘటించడం అందరికీ తెలుసునని, కానీ మోదీని కేరళ సీఎం కానీ, కేరళ సీఎంను మోదీ కానీ విమర్శించడం ఎవరూ విని ఉండరని రాహుల్ అన్నారు.

# ఆస్పత్రి నుంచి సోనియా డిశ్చార్జ్

**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ సీనియర్ నేత సోనియాగాంధీ ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఇటీవల అస్వస్థతకు గురయ్యారు. వాతావరణ మార్పుల వల్ల ఆమె పొట్ట, మూత్రనాళ ఇన్ఫెక్షన్‌కు గురవ్వడంతో చికిత్స కోసం కుటుంబ సభ్యులు సర్ గంగా రామ్ ఆసుపత్రిలో చేర్పించారు. ఆరోగ్యం మెరుపడిన తర్వాత మంగళవారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఆమె తదుపరి చికిత్స ఇంటివద్దే కొనసాగుతుందని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. మార్చి 24న చికిత్స కోసం సోనియాగాంధీ ఆసుపత్రిలో చేరారు. ఆమెకు డాక్టర్ డి.ఎస్.రాణా, డాక్టర్ ఎస్. నంది, డాక్టర్ అరూప్ బసుల బృందం పర్యవేక్షణలో చికిత్సనందించడం జరిగింది. ఇన్ఫెక్షన్ తగ్గించడానికి ఆమెకు యాంటీబయోటిక్స్ అందించారు. చికిత్సకు స్పందించి ఆమె కోలుకున్నారు. మంగళవారం డిశ్చార్జ్ అయ్యారు. ఆమె తదుపరి చికిత్స ఇంటివద్దే కొనసాగుతుంది అని ఆసుపత్రి ఛైర్మన్ డాక్టర్ అజరు స్వరూప్ వెల్లడించారు.

# హర్మూజ్‌పై ఇరాన్ పట్టుబిగింపు

**ఇక్కడి నంచే వెళ్లే నౌకలకు టోల్ వసూల్**

**ఒక్కో ట్యాంకర్‌పై గరిష్ఠంగా రూ.18.90 కోట్ల టోల్**

**టెహ్రాన్ :** చమురు రవాణాలో ప్రపంచానికి అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిపై ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మార్గంలో ప్రయాణించే నౌకలపై టోల్ వసూలు చేయడానికి ఆ దేశ పార్లమెంట్ భద్రతా కమిటీ ఆమోదం తెలిపింది. హర్మూజ్ మేనేజ్‌మెంట్ ప్రణాళికకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో, ఇకపై ఈ జలసంధి గుండా వెళ్లే చమురు ట్యాంకర్ల నుంచి భారీ మొత్తంలో రుసుము వసూలు చేయనున్నారు. ఒక్కో ట్యాంకర్‌పై గరిష్ఠంగా సుమారు రూ.18.90 కోట్ల వరకు టోల్ విధించనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ నిర్ణయం వెనుక హర్మూజ్‌పై తమ సార్వభౌమాధికారాన్ని బలోపేతం చేయాలన్న లక్ష్యం ఉందని ఇరాన్ అధికారిక మీడియా పేర్కొంది. కొత్త విధానంలో భాగంగా సముద్ర భద్రతను పెంచడం, నౌకాయాన నియంత్రణను కట్టుదిట్టం చేయడం, ఆర్థిక నియమావళిని అమలు చేయడం వంటి అంశాలు ఉన్నాయి. అ టోల్ వ్యవస్థను అనుసరించి ఇప్పటికే 26 నౌకలు ఈ మార్గం గుండా ప్రయాణించినట్లు తెలిపింది. ఆయా నౌకలు అవసరమైన పత్రాలు సమర్పించి అనుమతి కోడ్‌లు పొందినట్లు సమాచారం. అయితే ఈ నిర్ణయంపై అంతర్జాతీయ స్థాయిలో తీవ్ర విమర్శలు వ్యక్తమవు తున్నాయి. దీనిని ఖండిస్తూ, హర్మూజ్ వంటి అంతర్జాతీయ జలమార్గాలపై ఏకపక్ష నియంత్రణను ప్రపంచ దేశాలు అంగీకరించబోవని హెచ్చరించింది. అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్క్ రుబియో ఈ చర్యలను వ్యంగ్యంగా విమర్శిస్తూ, అంతర్జాతీయ నౌకాయాన స్వేచ్ఛకు భంగం కలిగించే చర్యలని పేర్కొన్నారు. ఇదే సమయంలో జీ7 దేశాలు కూడా ఈ నిర్ణయాన్ని తప్పుబడుతూ, సముద్ర మార్గాల్లో స్వేచ్ఛాయుత రవాణా కొనసాగేందుకు తక్షణ చర్యలు అవసరమని సూచించాయి.

# కూకట్‌పల్లిలో దారుణ ఘటన

**ఇద్దరు బిడ్డలను చంపి తల్లి ఆత్మహత్య**

**హైదరాబాద్ :** కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటు చేసుకుంది. కైతలాపూర్ రాఘవేంద్ర కాలనీలో ఓ మహిళ తన ఇద్దరు కుమారులను చంపేసింది. ఆ తరువాత తానూ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆ మహిళ తన ఇద్దరు పిల్లలు కార్తీక్ (12), కౌశిక్ (10) లతో కలిసి రాఘవేంద్ర కాలనీలో నివాసం ఉంటోంది. కుటుంబ తగాదాల కారణంగా భర్త ప్రవీణ్ దూరంగా ఉంటున్నాడు. అయితే, ఇటీవలే అతను రెండో వివాహం చేసుకున్నాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన మహిళ.. తన ఇద్దరు కొడుకులను చంపేసింది. ఆ తరువాత తాను కూడా ఆత్మహత్య చేసుకుంది. దీనిని గమనించిన స్థానికులు.. కూకట్‌పల్లి పీఎస్‌కు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. మృతదేహాలను పరిశీలించి.. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తల్లి ఇంతటి దారుణానికి పాల్పడటానికి గల పూర్తి కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. పూర్తి స్థాయి దర్యాప్తు చేస్తున్నారు.

# మీ ఆయిల్ మీరే తెచ్చుకోండి!

- బ్రిటన్, ఫ్రాన్స్ తదితర మిత్ర దేశాలపై ట్రంప్ ఆగ్రహం
- ఇకపై ఆ దేశాలకు అమెరికా సాయం అందదని హెచ్చరిక
- ఇస్ఫహాన్ పై వెయ్యి కేజీల బంకర్ బస్టర్‌తో దాడి
- ఇరాన్ సైనిక కేంద్రంపై విరుచుకు పడిన అమెరికా
- ఇరాన్ ఓడే వరకూ యుద్ధం చేయాలని ట్రంప్ను పట్టుపడుతున్న గల్ఫ్ దేశాలు
- ట్రంప్ యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్న 61 శాతం మంది అమెరికన్లు



**వాషింగ్టన్:** ఇరాన్పై దాడులలో అమెరికాకు సహాయం చేయని దేశాలపై అధ్యక్షుడు ట్రంప్ ఉక్రోశం వెళ్లగక్కారు. మీ చమురు మీరు తెచ్చుకోండని హెచ్చరించారు. ఆయన మంగళవారం తన సొంత సోషల్ మీడియా ట్రూత్లో తనకు అండగా నిలవని దేశాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ దేశాలు తనకు ఎలా అండగా నిలువలేదో, అలాగే ఆ దేశాలకు ఇకపై అమెరికా సహాయం అందించదని స్పష్టం చేశారు. ఇరాన్ ను నిర్వీర్యం చేయడంలో పాలుపంచుకోవడానికి నిరాకరించిన దేశాలు, అమెరికా నుండి చమురు కొనుగోలు చేయాలి లేదా హోర్ముజ్ జలసంధి గుండా వెళ్లి దాన్ని తీసుకోవాలని అన్నారు. వారు తమంతట తామే పోరాడటం నేర్చుకోవాలని తెలిపారు. హోర్ముజ్ జలసంధి కారణంగా జెట్' ఇంధనం పొందలేని దేశాలన్నింటికి. ఉదాహరణకు ఇరాన్ను నిర్వీర్యం చేయడంలో జోక్యం చేసుకోవడానికి నిరాకరించిన యునైటెడ్ కింగ్డమ్ వంటి దేశాలకు రెండు సూచనలు చేశారు. మొదటిది అమెరికా నుండి కొనండి. మా వద్ద పుష్కలంగా ఉంది. రెండవది, కొంత ఆలస్యమైనా ధైర్యం కూడగట్టుకుని, ఆ జలసంధికి వెళ్లి, దానిని స్వాధీనం చేసుకొండి అని ట్రంప్ ట్రూత్లో పేర్కొన్నారు. మీరు మీ కోసం మీరే పోరాడటం నేర్చుకోవాలి. మీరు మాకు అండగా లేనట్లే మీకు సహాయం చేయడానికి అమెరికా ఇకపై ఉండదు. ఇరాన్ దాదాపుగా నాశనమైపోయింది. కష్టమైన పని పూర్తయింది. వెళ్లి మీ చమురును మీరే తెచ్చుకోండి! అధ్యక్షుడు డిజేటీ అని ఆయన ట్రూత్ లో పోసి చేశారు. త్వరలో కాల్పుల విరమణ కుదరకపోతే, జలసంధిని తెరవకపోతే ఖర్ ద్వీపంలోని చమురు ఎగుమతి కేంద్రం పై, డీశాలినేషన్ ప్లాంట్లపై కూడా దాడి చేయడంతో సహా, అమెరికాతన దాడిని తీవ్రతరం చేస్తుందని కూడా ఈవారం ట్రంప్ హెచ్చరించిన సంగతి తెలిసిందే.

# 31వ రోజుకు చేరుకున్న ఇరాన్ యుద్ధం

**సెకనుకు సుమారు 9.8 లక్షలు ఖర్చు చేస్తున్న అమెరికా**

**న్యూఢిల్లీ :** ఇరాన్‌పై అమెరికా భీకరంగా దాడి చేస్తూ..విధ్వంసకర పేలుడు పదార్థాలు, క్షిపణులను ఆ దేశం వినియోగిస్తున్నది. చాలా ఖరీదైన ఆ ఆయుధాల వల్ల.. అమెరికా అనూహ్య రీతిలో యుద్ధం కోసం ఖర్చు చేస్తున్నది. ఇరాన్ వార్ కోసం అమెరికా ఖర్చు చేస్తున్న గణాంకాలను పరిశీలిస్తే షాక్ అవ్వాల్సిందే. ఇరాన్ వార్ కోసం ప్రతి సెకనుకు అమెరికా సుమారు 9.8 లక్షలు అంటే 10వేల డాలర్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం యుద్ధం 31వ రోజుకు చేరుకున్నది. అమెరికా పన్నుదారులకు చెందిన సుమారు 2.63 లక్షల కోట్లు ఇప్పటి వరకు ఖర్చు అయినట్లు తెలుస్తోంది. స్టాక్ హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసర్చ్ ఇన్‌స్టిట్యూట్ పరిశోధకులు ఈ విషయాన్ని చెప్పారు. ఫిబ్రవరి 28వ తేదీన ప్రారంభమైన యుద్ధం ప్రస్తుతం భీకర స్థాయికి చేరుకున్నది. ఈ యుద్ధం కోసం ప్రతి రోజు అమెరికా ప్రభుత్వం దాదాపు 8455 కోట్లు(890 మిలియన్ల డాలర్లు) ఖర్చు చేస్తున్నది. పేలుడు పదార్థాలు, ఎయిర్ ఆపరేషన్స్, నేవీ డిప÷-లాయ్‌మెంట్, మిస్సైల్ డిఫెన్స్, ఇంటెలిజెన్స్, లాజిస్టిక్స్‌తో అన్ని ఖర్చులు లెక్కేస్తున్నారు. ఎస్ఐపీఆర్ఐ నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. మునిషన్స్, మిస్సైళ్లకు ఎక్కువ ఖర్చు అవుతోంది. ప్రతి రోజు వాటి కోసం సుమారు 3040 కోట్లు ఖర్చు చేస్తున్నారు. అంటే మొత్తం ఖర్చులో అది 36 శాతంగా ఉంది. తోమాహాక్ క్రూయిజ్ మిస్సైళు ,, జేడీఏఎం బాంబులు, ప్రిసిషన్ గైడెడ్ బాంబులు ఉన్నాయి. వైమానిక ఆపరేషన్స్ కోసం ప్రతి రోజు సుమారు 2327.5 కోట్లు ఖర్చు చేస్తున్నారు. రోజు వారి ఖర్చులో ఇది 27.5 శాతంగా ఉంది. నౌకాదళ ఆపరేషన్స్ కోసం ప్రతి రోజు సుమారు 1475 కోట్లు ఖర్చు చేస్తున్నారు. యుద్ధ నౌకల మోహరింపు, డెస్ట్రాయర్లు, సబ్‌మెరైన్లు ఈ జాబితాలో ఉన్నాయి. మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్స్ థాడ్, పాట్రియాట్, ఏజిష్ బీఎండీ కోసం ప్రతి రోజు సుమారు 902 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇది రోజువారీ ఖర్చులో 11 శాతంగా ఉన్నట్లు పరిశోధకులు చెబుతున్నారు. ఇంటెలిజెన్స్, సైబర్ ఆపరేషన్స్ కోసం 427 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఐఎస్ఆర్ ఎలాట్‌ఫామ్స్, శాటిలైట్ ఇమేజ్‌లు, సైబర్ ఆపరేషన్స్ దీంట్లో ఉన్నాయి. పర్సనల్, లాజిస్టిక్స్ కోసం ప్రతి రోజు 285 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇరాన్‌పై యుద్ధం ఖర్చు మితిమీరిన నేపథ్యంలో.. ఈ అంశంపై గల్ఫ్ దేశాలతో అమెరికా చర్చించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. యుద్ధ ఖర్చుల్లో గల్ఫ్ దేశాల సహాయాన్ని అమెరికా కోరే అవకాశాలు ఉన్నాయి. 1990లో జరిగిన గల్ఫ్ వార్ సమయంలో జపాన్, జర్మనీ దేశాలు అమెరికాకు సాయం చేశాయి. ప్రస్తుతం తమకు నష్ట పరిహారం చెల్లించాలని ఇరాన్ కూడా డిమాండ్ చేస్తున్నది. ఈ నేపథ్యంలో గల్ఫ్ దేశాలను అమెరికా సాయం కోరే ఛాన్సు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు.

# ఇరాన్‌పై అమెరికా భీకర దాడులు

**ఆయుధ నిల్వల డిపోపై దాడి**

**టెహ్రాన్:** ఇరాన్ అణు కేంద్రక నగరం ఇస్ఫహాన్‌పై అమెరికా భీకర దాడులు చేసింది. ఆయుధ నిల్వలు ఉన్న ఓ డిపోపై బంకర్ బస్టర్లతో విరుచుకుపడింది. రెండు వేల పౌండ్ల బంకర్ బస్టర్లతో దాడులు చేయడంతో అక్కడ భారీగా మంటలు చెలరేగాయి. ఈ దాడికి సంబంధించిన వీడియోను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక ట్రూత్‌లో పంచుకున్నారు. అయితే దాడికి సంబంధించి ఆయన ఎలాంటి వివరణా ఇవ్వలేదు. ఇస్ఫహాన్‌లో ఇరాన్ ఆయుధ నిల్వలు ఉన్న ఓ డిపోపై అమెరికా-ఇజ్రాయెల్ దాడులు చేసినట్టు 'వాల్‌స్ట్రీట్ జర్నల్' వెల్లడించింది. ఇస్ఫహాన్‌పై వరుస దాడులు జరగడంతో ఆ ప్రాంతంలో భారీగా మంటలు చెలరేగుతున్నట్టు పేర్కొంది. అయితే ఈ దాడులపై ఇరాన్ ఇప్పటివరకు స్పందించలేదు. కాగా, ఇస్ఫహాన్‌లోని ఓ భూగర్భ కేంద్రంలో సుమారు 540 కిలోల యురేనియం నిల్వలను ఇరాన్ దాచినట్టు వార్తలు వస్తున్నాయి. ఆ యురేనియం నిల్వల లక్ష్యంగానే తాజా దాడులు జరిగినట్టు సమాచారం. కాగా, తమతో ఒప్పందానికి రాకపోతే ఇరాన్‌పై భారీగా దాడులు చేస్తామని ఇప్పటికే ట్రంప్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. మరోవైపు అమెరికాతో ఒప్పందానికి అంగీకరించేది లేదని ఇరాన్‌కు చెందిన పలువురు కీలక నేతలు వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అమెరికా దాడులకు దిగినట్టు తెలుస్తోంది.

# నలంద ఆలయంలో తొక్కిసలాట

**8మంది మహిళా భక్తులు మృత్యువాత**



**పాట్నా :** బీహార్‌లోని నలందలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. నలందలో ఒక ఆలయం వద్ద తొక్కిసలాట జరిగింది. నలంద జిల్లాలోని శీతలా మాత ఆలయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది మృతి చెందారు. అందరూ మహిళలే కావడం గమనార్హం. ఈ ఘటనలో మరో 12 మందికి పైగా గాయపడ్డారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఈ తొక్కిసలాట చోటు చేసుకుంది. నలంద జిల్లాలోని బీహార్ షరీఫ్‌కు దాదాపు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న మఘ్రా గ్రామంలోని శీతలాష్టమి ఆలయం వద్ద ఈ తొక్కిసలాట జరిగింది. చైత్ర మాసంలోని చివరి మంగళవారం కావడంతో, ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అధిక సంఖ్యలో మహిళలు మంగళవారం నాడు ఈ గుడికి వస్తుంటారు. నిర్వహణ లోపం కారణంగానే ఈ తొక్కిసలాట జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పదుల సంఖ్యలో మహిళలు స్పృహ తప్పిపోడిపోయిన దృశ్యాలు కలవరపెడుతున్నాయి. బాగా రద్దీగా ఉండడంతో అంబులెన్స్‌లు కూడా అక్కడకు చేరుకోవడం ఇబ్బందిగా మారింది. గాయపడిన వారికి స్థానికులు సపర్యలు చేస్తున్నారు. చేతులతో ఎత్తుకుని అంబులెన్స్‌ల వద్దకు తీసుకెళ్తున్నారు.

# బెంగాలీలను బీజేపీ అవమానం చేస్తోంది

**నా ముఖం చూసి మాత్రమే ఓటేయండి**

**సెంటిమెంట్ మాటలతో మమత ప్రచారం**



**కోల్‌కతా :** భారతీయ జనతా పార్టీ పై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ నిప్పులు చెరిగారు. బీజేపీని 'అనాగరిక' పార్టీగా అభివర్ణించారు. దేశంలోని బెంగాలీ మాట్లాడే వలస కార్మికులను టార్గెట్ చేస్తున్నారని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో వారిని వేధింపులు, అవమానాలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. బాంకురాలో మంగళవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో మమతా బెనర్జీ ప్రసంగించారు. టీఎంసీ అభ్యర్థులు ఎవరనేది కాకుండా తన నాయకత్వాన్ని మాత్రమే చూడాలని ఈ సందర్భంగా ఓటర్లను మమతాబెనర్జీ కోరారు. 294 నియోజకవర్గాల్లోనే తననే అభ్యర్థిగా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఓటర్ల జాబితాలో అవకతలను ప్రధానంగా ఆమె తన ప్రసంగంలో ప్రస్తావిస్తూ, ఒకేరోజు 30,000 అప్లికేషన్లు దాఖలైనట్టు పార్టీ నేత అభిషేక్ బెనర్జీ వద్ద సమాచారం ఉందని తెలిపారు. బెంగాల్ ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసేందుకు బిహార్, రాజస్థాన్, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఓటర్లను బీజేపీ దిగుమతి చేసుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తోందని ఆరోపించారు. 'బిహార్‌లో చేసినట్టుగానే రైల్వేలను ఉపయోగించుకుని బయట ప్రాంతాల నుంచి ఓటర్లను రప్పించేందుకు బీజేపీ ప్లాన్ చేస్తోంది' అని అన్నారు. భారత ఎన్నికల కమిషన్‌పై మమతా బెనర్జీ తీవ్ర ఆరోపణలు చేశారు. బీజేపీ చెప్పినట్టు ఈసీఐ నడుచుకుంటోందని, బీజేపీ-ఈసీ కలిసి ప్రజాస్వామిక, రాజ్యాంగ హక్కులను ఊడలాక్కుంటాయని ఆరోపించారు. ఓటర్ల లిస్ట్‌లో కొందరిని టా÷-గ్గ÷ట్ చేసి తొలగించడం, మరికొందరిని జాబితాలో చేర్చడం జరుగుతోందన్నారు. తప్పుడు ఫారం-6 అప్లికేషన్లతో బీహార్ ఓటర్ల జాబితాలో చేరేందుకు ప్రయత్నించిన పలువురు బీజేపీ కార్యకర్తలు పట్టుబడినట్టు చెప్పారు. ఇది కేవలం ఓటర్ల హైజాకింగ్ కిందకే వస్తుందన్నారు. చట్టబద్ధత కలిగిన 60 లక్షల అప్లికేషన్లు ఇప్పటికే పెండింగ్‌లోనే ఉన్నాయని అన్నారు. బల్క్ ఎంట్రీలను మాత్రం ఫాస్ట్ ట్రాక్ చేస్తున్నారని అన్నారు. ఇదెంతమాత్రం రొటీన్ పక్రియ కాదని, స్వేచ్ఛగా, సజావుగా ఎన్నికలు నిర్వహించడంపై జరుగుతున్న దాడి అని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వస్తే బెంగాల్‌లో మాంసాహారంపై నిషేధం విధిస్తుందని, దొడ్డిదారిన ఎన్ఆర్‌సీ తీసుకువచ్చే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. సాంస్కృతిక ఆంక్షలు, వివాదాస్పద విధానాలు అవలంబిస్తోందని అన్నారు.

# కూపర్ కనోలీ సూపర్ షో

## గుజరాత్‌పై పంజాబ్ థ్రిల్లింగ్ విక్టరీ




ఐపీఎల్ 2026లో పంజాబ్ కింగ్స్ అదిరిపోయే బోణీ కొట్టింది. ఆఖరి ఓవర్ వరకు ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌పై 3 వికెట్ల తేడాతో థ్రిల్లింగ్ విజయాన్ని అందుకుంది. 163 పరుగుల లక్ష్య ఛేదనలో పంజాబ్ మిడిల్ ఆర్డర్ కుప్పకూలినా, యువ ఆటగాడు కూపర్ కనోలీ (44 బంతుల్లో 72 నాటౌట్; 5 ఫోర్లు, 5 సిక్సర్లు) అద్భుతమైన ఇన్నింగ్స్‌తో ఒంటిచేత్తో జట్టును గెలిపించాడు. కీలక సమయంలో జేవియర్ బార్ట్‌లెట్ (5 బంతుల్లో 11 నాటౌట్) మెరుపులు మెరిపించడంతో మరో 5 బంతులు మిగిలి ఉండగానే పంజాబ్ విజయాన్ని అందుకుంది. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న పంజాబ్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్‌ను కట్టడి చేసింది. శుభ్‌మన్ గిల్ (39), జోస్ బట్లర్ (38) రాణించడంతో గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. పంజాబ్ బౌలర్లలో విజయ్‌కుమార్ వైశ్యాఖ్ 3 వికెట్లతో సత్తా చాటగా, యుజువేంద్ర చాహల్ 2 వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన పంజాబ్‌కు ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ (24 బంతుల్లో 37; 4 సిక్సర్లు) మెరుపు ఆరంభాన్ని ఇచ్చాడు. అయితే అతను ఔటయ్యాక పంజాబ్ ఇన్నింగ్స్ ఒక్కసారిగా తడబడింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (18) మినహా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. 118 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి పంజాబ్ పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో క్రీజులో పాతుకుపోయిన కూపర్ కనోలీ, గుజరాత్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా ఏమాత్రం ఒత్తిడికి గురికాకుండా సంయమనంతో ఆడుతూనే, వీలు చిక్కినప్పుడల్లా బౌండరీలు, సిక్సర్లు బాదుతూ స్కోరు బోర్డును ముందుకు నడిపించాడు. ఆఖరి ఓవర్లలో మ్యాచ్ తీవ్ర ఉత్కంఠను రేపింది. చివర్లో మార్కో యాన్సెన్ (9) ఔటవ్వడంతో పంజాబ్ శిబిరంలో ఆందోళన మొదలైంది. అయితే కనోలీకి జత కలిసిన బార్ట్‌లెట్ ఒక సిక్సర్ బాది సమీకరణాన్ని సులభతరం చేశాడు. దీంతో పంజాబ్ 19.1 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి ఈ సీజన్‌లో తమ తొలి విజయాన్ని ఘనంగా నమోదు చేసింది. గుజరాత్ బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ 3 వికెట్లు తీసినా ఫలితం లేకపోయింది. కనోలీ అసాధారణ పోరాట పటిమతో పంజాబ్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు.



## బీఆర్ఎస్ విమర్శలు అసత్యం: ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు

హైదరాబాద్, మార్చి 31: కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద చల్లడమే బీఆర్ఎస్ నాయకుల లక్ష్యంగా మారిందని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు విమర్శించారు. తెలంగాణ అసెంబ్లీ సిఎల్పీ మీడియా పాయింట్ వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకే ఎక్కువ సమయం ఇచ్చినప్పటికీ తమ గొంతు నొక్కారని చెప్పడం విచిత్రమన్నారు. అసెంబ్లీ రికార్డుల ప్రకారం హరీష్ రావు 4 గంటలు 16 నిమిషాలు, కేటీఆర్ 1 గంట 44 నిమిషాలు మాట్లాడారని తెలిపారు. ఇద్దరూ కలిపి దాదాపు 6 గంటల పాటు మాట్లాడినప్పటికీ తమకు అవకాశం ఇవ్వలేదని విమర్శించడం రాజకీయ ప్రయోజనాల కోసమేనని అన్నారు. ప్రతిపక్షాలకు తగిన సమయం ఇచ్చి సమగ్ర చర్చ జరిపినప్పటికీ చివరలో వాకౌట్ చేయడం బీఆర్ఎస్ ద్వంద వైఖరికి నిదర్శనమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా అసెంబ్లీ నిర్వహిస్తోందని పేర్కొన్నారు. ప్రతి ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరిస్తున్నప్పటికీ బీఆర్ఎస్‌కు జ్ఞానోదయం జరగడం లేదని విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపక్షాలకు అవకాశాలు ఇవ్వకుండా వ్యవహరించిందని ఆరోపించారు. మైనింగ్ అక్రమాలపై ప్రభుత్వం సీబీసీఐడీతో విచారణకు సిద్ధంగా ఉన్నప్పటికీ బీఆర్ఎస్ నాయకులు సహకరించడం లేదని అన్నారు. ప్రజల సమస్యల కంటే రాజకీయ లాభాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శించారు. రానున్న రోజుల్లో కూడా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే కొనసాగుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# ఆ కుర్రాడిపై ఒత్తిడి వద్దు

### కానీ కచ్చితంగా ఇండియాకు ఆడతాడు: వైభవ్‌పై అశ్విన్



ఐపీఎల్ 2026లో తన అరంగేట్ర మ్యాచ్‌లోనే విధ్వంసకర ఇన్నింగ్స్‌తో సంచలనం సృష్టించిన 15 ఏళ్ల యువ కెరటం వైభవ్ సూర్యవంశీపై టీమిండియా సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ప్రశంసల వర్షం కురిపించాడు. అయితే, ఇంత చిన్న వయసులోనే అతడిపై అంచనాలు పెంచి, టీమిండియాలోకి తీసుకురావాలంటూ తొందరపడొద్దని కీలక సూచన చేశాడు. నిన్న గువాహటిలో చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించడానికి వైభవ్ ఆటే కారణమైంది. మ్యాచ్‌లో తొలుత చెన్నైని 127 పరుగులకే కట్టడి చేసిన రాజస్థాన్, ఛేదనలో వైభవ్ సూర్యవంశీ మెరుపులతో ఆధిపత్యం చెలాయించింది. కేవలం 17 బంతుల్లో 52 పరుగులు చేసిన వైభవ్, అందులో 15 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసి ఐపీఎల్ చరిత్రలోనే మూడో వేగవంతమైన అర్ధశతకాన్ని నమోదు చేశాడు. అతని ధాటికి రాజస్థాన్ పవర్‌ప్లేలోనే వికెట్ నష్టపోకుండా 74 పరుగులు చేసి మ్యాచ్‌ను ఏకపక్షం చేసింది. ఈ ప్రదర్శనపై తన యూట్యూబ్ ఛానల్‌లో మాట్లాడిన అశ్విన్, వైభవ్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. "అతడికి అలాంటి లక్ష్యాలు నిర్దేశించకండి. అతను ఇంకా కుర్రాడు కాదు, ఒక పిల్లాడు. ఎంఎస్ ధోనీ 44 ఏళ్ల వరకు ఆడితే, సూర్యవంశీ 40 ఏళ్ల వరకు ఆడినా.. అతనికి ఇంకా రెండున్నర దశాబ్దాల క్రికెట్ భవిష్యత్తు ఉంది. అతడిని ప్రశాంతంగా వదిలేయండి. సరైన సమయంలో తనే పైకొస్తాడు. టీమిండియాకు ఆడలేనంత స్థాయి ఆటగాడు కాదు. కచ్చితంగా ఏదో ఒక రోజు ఆడతాడు. ఎప్పుడు ఆడతాడనే దాని కోసం మనం కాస్త ఆగాలి. మనకెందుకంత తొందర?" అని అశ్విన్ ప్రశ్నించాడు. వైభవ్ బ్యాటింగ్ తీరును అశ్విన్ ఆకాశానికెత్తాడు. "అతనికి 15 ఏళ్లు నిండాయి. అందుకే 15 బంతుల్లో 50 కొట్టాడు. తన వయసును చూపిస్తున్నాడు. అతను ఎంత అద్భుతమైన ఆటగాడు? అతని బ్యాట్ స్పీడ్ ఎంత వేగంగా ఉంది? అతని దెబ్బకు చెన్నై బౌలర్ల వద్ద సమాధానమే లేదు. ఫీల్డ్‌లో సీఎస్‌కే పూర్తిగా డీలాపడిపోయింది. ఈ ప్రదర్శనతో రాజస్థాన్ రాయల్స్ 'మమ్మల్ని చూడండి, ఈ టోర్నీలో మేం కూడా బలమైన జట్టే' అని చాటి చెప్పింది" అని అశ్విన్ చెప్పుకొచ్చాడు. వైభవ్ ఔటైన తర్వాత యశస్వి జైస్వాల్ (38 నాటౌట్), కెప్టెన్ రియాన్ పరాగ్ (14 నాటౌట్) మిగతా లాంఛనాన్ని పూర్తి చేశారు. మరో 47 బంతులు మిగిలి ఉండగానే రాజస్థాన్ విజయాన్ని అందుకుని ఈ ఐపీఎల్ సీజన్‌ను ఘనంగా ప్రారంభించింది.

## బంగ్లాదేశ్‌కు షాకిచ్చిన జియో హాట్ స్టార్




ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందిని అలరిస్తున్న ఐపీఎల్ 2026 ప్రసార హక్కుల విషయంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. బంగ్లాదేశ్‌లో ఐపీఎల్ మ్యాచ్‌ల ప్రత్యక్ష ప్రసారాలకు సంబంధించి అక్కడి ప్రముఖ బ్రాడ్‌కాస్టర్ టీ-స్పోర్ట్స్ (౧-ూజూశీ౯ం)తో ఉన్న ఒప్పందాన్ని జియో హాట్ స్టార్ రద్దు చేసుకుంది. ఈ మేరకు టీ-స్పోర్ట్స్ యాజమాన్యానికి జియో హాట్ స్టార్ అధికారికంగా లేఖ రాసింది. వాస్తవానికి జియో హాట్ స్టార్ - టీ-స్పోర్ట్స్ మధ్య 2027 వరకు ఐపీఎల్ ప్రసారాల కోసం ఒప్పందం ఉంది. అయితే, ఒప్పంద నిబంధనల ప్రకారం చెల్లించాల్సిన బకాయిల విషయంలో టీ-స్పోర్ట్స్ సంస్థ విఫలమైనట్లు తెలుస్తోంది. ఆర్థిక పరమైన లావాదేవీల్లో స్పష్టత లేకపోవడం, సకాలంలో చెల్లింపులు జరగకపోవడంతోనే జియో హాట్ స్టార్ ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. బంగ్లాదేశ్‌లో ఇటీవల చోటుచేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఐపీఎల్ ప్రసారాలపై అక్కడి ప్రభుత్వం గతంలో నిషేధం విధించింది. అయితే, తాజాగా ఆ నిషేధాన్ని ఎత్తివేయడంతో ఐపీఎల్ మ్యాచ్‌లను చూడొచ్చని ఆశపడ్డ అభిమానులకు జియో హాట్ స్టార్ నిర్ణయం పిడుగులాంటి వార్తగా మారింది.

## బీసీసీఐ తీసుకున్న నిర్ణయం సరైనదే : గంగూలీ

భారత్-ఆస్ట్రేలియా మధ్య జరగనున్న ప్రతిష్ఠాత్మక టెస్టు సిరీస్ (బోర్డర్ - గవాస్కర్ ట్రోఫీ) వేదికల ఎంపికపై సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చపై టీమిండియా మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ స్పందించారు. ఈడెన్ గార్డెన్స్‌లో టెస్టు మ్యాచ్ జరగకపోవడం పట్ల బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తనకు కొంత నిరాశ ఉన్నప్పటికీ, బోర్డు తీసుకున్న నిర్ణయం సరైనదేనని ఆయన అభిప్రాయపడ్డారు. "ఒక మాజీ క్రికెటర్‌గా కోల్‌కతాలో మ్యాచ్ జరగాలని నేను కోరుకుంటాను. కానీ, కేవలం సంప్రదాయ వేదికలకే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న ఇతర మైదానాలకూ అవకాశం ఇవ్వడం ముఖ్యం" అని గంగూలీ అన్నారు. గువాహటి, రాంచీ వంటి నగరాల్లో టెస్టులు నిర్వహించడం వల్ల అక్కడి అభిమానులకు మేలు జరుగుతుందని, ప్రస్తుతం దేశంలోని అన్ని స్టేడియాల్లోనూ ప్రపంచ స్థాయి సదుపాయాలు ఉన్నాయని ఆయన చెప్పారు. 2001లో ఈడెన్ గార్డెన్స్‌లో ఆస్ట్రేలియాపై సాధించిన చారిత్రక విజయాన్ని గుర్తుచేసుకున్న దాదా, ఆనాటి ఆటగాళ్లంతా మళ్లీ ఒక చోట చేరాలని ప్లాన్ చేస్తున్నట్లు వెల్లడించారు. "మేమంతా ఈ నెలలోనే కలవాల్సి ఉంది. అయితే సచిన్ టెండూల్కర్ కుమారుడి (అర్జున్ టెండూల్కర్) వివాహం ఉండటంతో ఆ భేటీని వాయిదా వేశాం. త్వరలోనే ఆ వేడుక ఎప్పుడనేది ప్రకటిస్తాం" అని ఒక ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. తన కెరీర్‌లో లార్డ్స్ బాల్కనీలో చొక్కా విప్పిన నాట్‌వెస్ట్ ట్రోఫీ విజయం కంటే.. కోల్‌కతా, అడిలైడ్, హెడింగ్లేలలో సాధించిన టెస్టు విజయాలే తనకు ఎక్కువ సంతృప్తినిస్తాయని గంగూలీ చెప్పారు. పాకిస్థాన్ తో జరిగిన టెస్టులో సెహ్వాగ్ ట్రిపుల్ సెంచరీ గురించి చెబుతూ... "300 పరుగుల దగ్గర సింగిల్ తీయమని నేను చెప్పినా వినకుండా, వీరూ సిక్స్‌తోనే దాన్ని పూర్తి చేశాడు. త్రిశతకాలు తరచూ రావు, అందుకే అప్పుడు నేను కాస్త కంగారు పడ్డాను" అని నవ్వుతూ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ప్రస్తుతం బీసీసీఐ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నాగ్‌పూర్, చెన్నై, గువాహటి, రాంచీ, అహ్మదాబాద్‌లు బోర్డర్-గావస్కర్ ట్రోఫీకి ఆతిథ్యం ఇవ్వనున్నాయి.

# పీఎస్ఎల్‌లో బాల్ ట్యాంపరింగ్

### ఫఖర్ జమాన్‌పై రెండు మ్యాచ్‌ల నిషేధం




పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్)లో లాహోర్ ఖలందర్స్ జట్టుకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు స్టార్ ఓపెనర్ ఫఖర్ జమాన్‌పై రెండు మ్యాచ్‌ల నిషేధం పడింది. బాల్ ట్యాంపరింగ్‌కు పాల్పడినట్టు తేలడంతో పీఎస్ఎల్ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. తాజాగా ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. లాహోర్‌లోని గడ్డాఫీ స్టేడియంలో ఈ నెల 29న కరాచీ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్ సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది. కరాచీ ఇన్నింగ్స్ చివరి ఓవర్లలో ఫఖర్ జమాన్ బంతి ఆకారాన్ని మార్చేందుకు ప్రయత్నించినట్టు ఆన్-ఫీల్డ్ అంపైర్లు గుర్తించారు. దీంతో వెంటనే లాహోర్ ఖలందర్స్ జట్టుకు 5 పరుగుల పెనాల్టీ విధించి, బంతిని మార్చారు. ఈ ఘటనపై ఆన్-ఫీల్డ్ అంపైర్లు షాహిద్ సైకత్, ఫైసల్ ఖాన్ అఫ్రీదీ, టీవీ అంపైర్ ఆసిఫ్ యాకూబ్, నాలుగో అంపైర్ తారిఖ్ రషీద్‌లు మ్యాచ్ రిఫరీకి ఫిర్యాదు చేశారు. పీఎస్ఎల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌లోని ఆర్టికల్ 2.14 ప్రకారం బంతి ఆకారాన్ని మార్చడం లెవల్ 3 నేరంగా పరిగణిస్తారు.

అయితే, ఫఖర్ జమాన్ తనపై వచ్చిన ఆరోపణలను అంగీకరించకుండా, విచారణను కోరాడు. దీంతో మ్యాచ్ రిఫరీ రోషన్ మహానామా ఆధ్వర్యంలో అధికారిక విచారణ జరిగింది. ఈ విచారణకు ఫఖర్ జమాన్‌తో పాటు లాహోర్ ఖలందర్స్ కెప్టెన్ షహీన్ అఫ్రిది, జట్టు డైరెక్టర్ సమీన్ రాణా, మేనేజర్ ఫరూఖ్ అన్వర్ హాజరయ్యారు. ఫఖర్ వాదనలను విన్నప్పటికీ, అందుబాటులో ఉన్న సాక్ష్యాలను పరిశీలించిన తర్వాత అతన్ని దోషిగా నిర్ధారించిన మ్యాచ్ రిఫరీ, రెండు మ్యాచ్‌ల నిషేధాన్ని ఖరారు చేశారు. ఈ నిషేధం కారణంగా ఫఖర్ జమాన్.. ఏప్రిల్ 3న ముల్తాన్ సుల్తాన్స్‌తో గడ్డాఫీ స్టేడియంలో, ఏప్రిల్ 9న కరాచీలోని నేషనల్ బ్యాంక్ స్టేడియంలో ఇస్లామాబాద్ యునైటెడ్‌తో జరిగే కీలక మ్యాచ్‌లకు దూరం కానున్నాడు. ఈ స్టార్ ఓపెనర్ సేవలను కోల్పోవడం లాహోర్ జట్టుపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది.

# పాక్ క్రికెటర్లకు కొత్త రూల్

### రాజకీయ పోస్టులు పెడితే కోటి ఫైన్!




పాకిస్థాన్ ఫాస్ట్ బౌలర్ నసీం షాకు ఆ దేశ క్రికెట్ బోర్డు (పీసీబీ) భారీ జరిమానా విధించింది. పంజాబ్ ముఖ్యమంత్రి మరియం నవాజ్‌పై సోషల్ మీడియాలో వివాదాస్పద పోస్ట్ చేసినందుకు గానూ అతడికి 72,000 అమెరికన్ డాలర్లు (పాకిస్థాన్ కరెన్సీలో సుమారు రూ. 2 కోట్లు) ఫైన్ వేసింది. ఈ ఘటన నేపథ్యంలో, కేంద్ర కాంట్రాక్టులో ఉన్న ఆటగాళ్లందరికీ పీసీబీ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ఇకపై రాజకీయపరమైన పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేసింది. వివరాల్లోకి వెళితే... ఇటీవల పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్) 2026 ప్రారంభ మ్యాచ్‌కు పంజాబ్ సీఎం మరియం నవాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ కుమార్తె, ప్రస్తుత ప్రధాని షెహబాజ్ షరీఫ్ కు కూతురు వరుస అవుతుంది. అయితే, నసీం షా సోషల్ మీడియాలో "గడాఫీ స్టేడియంలో ఆమెకు రాణికి ఇచ్చినంత గౌరవం ఎందుకు ఇస్తున్నారు?" అని వ్యంగ్యంగా పోస్ట్ చేశాడు. గల్ఫ్ యుద్ధం కారణంగా దేశంలో నెలకొన్న సంక్షోభం దృష్ట్యా ప్రభుత్వ పొదుపు చర్యల్లో భాగంగా అభిమానులను స్టేడియాల్లోకి అనుమతించని సమయంలో ఒక రాజకీయ నాయకురాలికి ఇంతటి ప్రాధాన్యత ఇవ్వడంపై ఈ పోస్ట్ దుమారం రేపింది. ఈ పోస్ట్‌ను వెంటనే తొలగించి, తన ఖాతా హ్యాక్ అయిందని నసీం షా వివరణ ఇచ్చే ప్రయత్నం చేశాడు. అయితే, ఈ వాదనను పీసీబీ అంగీకరించలేదు. ఈ నెల 27న అతడికి షోకాజ్ నోటీసు జారీ చేసి, విచారణ చేపట్టింది. క్రమశిక్షణ కమిటీ విచారణ అనంతరం సెంట్రల్ కాంట్రాక్ట్ నిబంధనలను, సోషల్ మీడియా మార్గదర్శకాలను ఉల్లంఘించినట్లు తేల్చి రూ. 2 కోట్ల జరిమానా విధించింది. నసీం షా బేషరతుగా క్షమాపణ చెప్పినట్లు బోర్డు తెలిపింది. ఈ ఘటనకు బాధ్యుడిగా అతడి సోషల్ మీడియా సలహాదారుడిని కూడా విధుల నుంచి తొలగించి, బ్లాక్‌లిస్ట్‌లో పెట్టింది. ఈ నేపథ్యంలో ఆటగాళ్ల సోషల్ మీడియా వినియోగంపై పీసీబీ కఠిన నిబంధనలు తీసుకొచ్చింది. జియో న్యూస్ కథనం ప్రకారం.. ఇకపై బోర్డు మీడియా విభాగం నుంచి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి రాజకీయపరమైన పోస్టులు పెట్టరాదని ఆటగాళ్లకు, వారి మేనేజర్లకు స్పష్టం చేసింది. నిబంధనలు ఉల్లంఘిస్తే కనీసం కోటి రూపాయల జరిమానా విధిస్తామని హెచ్చరించింది. రాజకీయ పోస్టులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని బోర్డు స్పష్టం చేసింది.

మానేరు జనత
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక
www.epaperjanathadaily.in
బుధవారం 1 ఏప్రిల్ 2026


# నన్నెవ్వరూ ఆపలేరు

## ట్రోల్స్‌కు నిహారిక స్ట్రైట్ ఆన్సర్



మెగా ఫ్యామిలీ నుంచి యాంకర్‌గా ప్రయాణం మొదలుపెట్టి, నేడు సక్సెస్‌ఫుల్ నిర్మాతగా రాణిస్తున్నారు నిహారిక కొణిదెల. తన పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై విభిన్నమైన కథలను తెరకెక్కిస్తూ తనదైన ముద్ర వేస్తున్నారు. అయితే, ఆమె తీసుకునే ప్రతి నిర్ణయంపై ఇండస్ట్రీలో ఏదో ఒక విమర్శ వినిపిస్తూనే ఉంది. తాజాగా తను నిర్మించిన 'రాకాస' సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో ఈ విమర్శలపై నిహారిక చాలా ఘాటుగా స్పందించారు. నెటిజన్లను ఆకట్టుకుంటున్న ఆ ఆసక్తికర విశేషాలు ఇప్పుడు చూద్దాం..

నిహారిక కొణిదెల నిర్మాతగా మారినప్పటి నుండి ఆమె అడుగులను ఎవరో ఒకరు ప్రశ్నిస్తూనే ఉన్నారు. 'రాకాస' ఈవెంట్‌లో ఆమె మాట్లాడుతూ తన ఆవేదనను, ధైర్యాన్ని ఒకేసారి బయటపెట్టారు. "నేను 'కమిటీ కుర్రాళ్ళు' చేసినప్పుడు 15 మంది కొత్తవాళ్లను ఎందుకు పరిచయం చేస్తున్నావు? తలనొప్పులు ఎందుకు? అని అడిగారు. తీరా అది హిట్ అయ్యాక, ఇప్పుడు విజువల్ ఎఫెక్ట్స్‌తో 'రాకాస' తీస్తుంటే.. మళ్ళీ పాత తరహా సినిమాలే చేయొచ్చు కదా అని అడుగుతున్నారు. నేనేం చేసినా నన్ను అనేవాళ్లు ఉంటారు, కానీ నేను నమ్మిన పని చేస్తూనే ఉంటా" అని గట్టిగా చెప్పారు. నిహారిక తన తదుపరి భారీ ప్రాజెక్ట్‌ను అన్నయ్య వరుణ్ తేజ్‌తో 'బరి' అనే పేరుతో నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. దీనిపై కూడా విమర్శలు వస్తున్నాయని ఆమె వెల్లడించారు. "చిన్నవాళ్లతో సినిమాలు చేయొచ్చు కదా, అప్పుడే అంత పెద్ద ప్రాజెక్ట్ ఎందుకు? ఫ్యామిలీ వాళ్లతో ఎందుకు చేస్తున్నావు?" అని కొందరు ప్రశ్నిస్తున్నారట. ఇక ఇలా ప్రతి విషయంలోనూ ఎదురవుతున్న అడ్డంకులను పక్కన పెట్టి, నిర్మాతగా తనకున్న విజన్‌తో ముందుకు సాగుతానని, ఎవరికీ భయపడే ప్రసక్తి లేదని ఆమె స్పష్టం చేశారు.




# హాలీవుడ్ స్థాయిలో అనుష్క 'కథనార్'

స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి ప్రధాన పాత్రలో నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'కథనార్' ట్రైలర్ విడుదలైంది. మలయాళంలో భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ పీరియాడిక్ ఫాంటసీ హారర్ థ్రిల్లర్ ట్రైలర్, ప్రేక్షకులలో సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. హాలీవుడ్ స్థాయి విజువల్స్, ఉత్కంఠభరితమైన సన్నివేశాలతో ఈ ట్రైలర్ సోషల్ మీడియాలో విశేష స్పందన దక్కించుకుంటోంది. రోజిన్ థామస్ దర్శకత్వంలో శ్రీ గోకులం మూవీస్ బ్యానర్‌పై గోకులం గోపాలన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో జయసూర్య, ప్రభుదేవా, వినీత్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. 13వ శతాబ్దం నాటి కథాంశంతో రూపొందుతున్న ఈ సినిమాలో అనుష్క పాత్ర ఎంతో గంభీరంగా, మిస్టరీతో కూడుకుని ఉన్నట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. పీరియాడిక్ సెట్టింగ్స్, వీఎఫ్ఎక్స్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. మలయాళంతో పాటు తెలుగు, తమిళం, హిందీ, కన్నడ భాషల్లో ఈ సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 'బాహుబలి' తర్వాత సరైన విజయం కోసం ఎదురుచూస్తున్న అనుష్కకు ఈ సినిమా ఎంతో కీలకంగా మారింది. ఇటీవల ఆమె నటించిన 'ఘాటీ' ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో 'కథనార్' చిత్రంలో అనుష్క పోషిస్తున్న శక్తిమంతమైన పాత్ర ఆమె కెరీర్‌కు మళ్లీ ఊపునిస్తుందని అభిమానులు గట్టి నమ్మకంతో ఉన్నారు. ఈ సినిమాతో స్వీటీ బలంగా కంబ్యాక్ ఇస్తుందని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.



# ఓటీటీలోకి అడుగుపెడుతున్న 75 కోట్ల సినిమా!

ఓటీటీలోకి అడుగుపెట్టడానికి ఒక తమిళ సినిమా రెడీ అవుతోంది. ఆ సినిమా పేరే 'తాయి కిళవి'. రాధిక ప్రధానమైన పాత్రను పోషించిన ఈ సినిమాకి, శివకుమార్ మురుగేశన్ దర్శకత్వం వహించాడు. ఈ సినిమా నిర్మాతలలో శివ కార్తికేయన్ ఒకరుగా వ్యవహరించడం విశేషం. ఈ ఏడాది ఫిబ్రవరి 27వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, తొలి రోజునే సక్సెస్ టాక్ ను సొంతం చేసుకుంటూ దూసుకెళ్లింది. 10 కోట్ల బడ్జెట్ తో నిర్మితమైన ఈ సినిమా, 75 కోట్ల వరకూ రాబట్టింది. లుక్ పరంగా .. నటన పరంగా రాధిక మంచి మార్కులు కొట్టేసిన ఈ సినిమాలో, మునీశ్ కాంత్ .. సింగం పులి .. అరుళ్ దాస్ .. బాలశరవణన్ ముఖ్యమైన పాత్రలను పోషించారు. అలాంటి ఈ సినిమా స్ట్రీమింగ్ హక్కులను 'జియో హాట్ స్టార్' వారు సొంతం చేసుకున్నారు. ఏప్రిల్ 10వ తేదీ నుంచి తమిళంతో పాటు వివిధ భాషల్లో ఈ సినిమాను విడుదల చేయనున్నట్టుగా ప్రకటించారు. కథలోకి వెళితే రాధిక పాత్ర పేరు 'పవనుత్తాయి'. 70 ఏళ్ల వయసున్న ఆమె వడ్డీ వ్యాపారం చేస్తూ ఆస్తిపాస్తులను బాగానే వెనకేస్తుంది. ఆమె అంటే ముగ్గురు కొడుకులకు .. కోడళ్లకు హడల్. అందరినీ భయపెడుతూ బ్రతికేస్తూ వచ్చిన ఆమె, పక్షవాతంతో మంచాన పడుతుంది. మాటపడిపోయిన ఆమె సైగలతో రోజులు నెట్టుకొస్తూ ఉంటుంది. సంపాదించిందంతా ఆమె బంగారంగా మార్చేసి దాచి ఉంచిందని భావించిన కుటుంబ సభ్యులు ఏం చేస్తారు? అనేది కథ.

# సల్మాన్ సరసన నయన్

బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్, టాలీవుడ్ దర్శకుడు వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో రాబోతున్న భారీ చిత్రంపై ఓ కీలక అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలో హీరోయిన్‌గా లేడీ సూపర్ స్టార్ నయనతారను ఖరారు చేసినట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ ప్రకటనతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ (ఎస్వీసీ) బ్యానర్‌పై అగ్ర నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇది వారి 63వ చిత్రం (ఎస్వీసీ63). ఈ ప్రాజెక్ట్‌లోకి నయనతారకు స్వాగతం పలకడం గౌరవంగా భావిస్తున్నామని, 'ది క్వీన్' అడుగుపెట్టిందని నిర్మాణ సంస్థ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఇప్పటికే నయనతార బాలీవుడ్‌లో షారుఖ్ ఖాన్ సరసన 'జవాన్' చిత్రంలో నటించి భారీ బ్లాక్‌బస్టర్‌ను తన ఖాతాలో వేసుకున్నారు. ఆ సినిమాతో ఉత్తరాది ప్రేక్షకులను సైతం మెప్పించిన ఆమె, ఇప్పుడు మరో అగ్ర కథానాయకుడు సల్మాన్ ఖాన్‌తో జతకట్టడం సినీ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. తెలుగు దర్శకుడు, టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ కలిసి చేస్తున్న ఈ పాన్-ఇండియా ప్రాజెక్ట్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది.



# 2న రామాయణ టీజర్




బాలీవుడ్ స్టార్ హీరో రణబీర్ కపూర్ ప్రధాన పాత్రలో ప్రముఖ దర్శకుడు నితీష్ తివారీ తెరకెక్కిస్తున్న పౌరాణిక చిత్రం 'రామాయణ'. దాదాపు రూ.3000 కోట్ల బ్జడెట్‌తో రాబోతున్న ఈ చిత్రం దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. తాజాగా ఈ సినిమా టీజర్‌కు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ క్లియరెన్స్ ఇచ్చింది. ఈ చిత్రం నుంచి 'రామ' పేరుతో రాబోతున్న ఈ టీజర్ విడుదలకు ముందు సెన్సార్ బోర్డు నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో ఏప్రిల్ 2న టీజర్ విడుదల చేయడానికి మార్గం సుగమమైంది. దీనితో పాటు ఈ టీజర్ నిడివికి సంబంధించిన వివరాలు కూడా వెల్లడయ్యాయి. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం, 'రామ' టీజర్ రన్‌టైమ్ 2 నిమిషాల 38 సెకన్లుగా ఉంది. ఈ టీజర్‌కు సెన్సార్ బోర్డు యూనివర్సల్ రేటింగ్ ఇచ్చింది, దీంతో ఈ టీజర్‌ను అన్ని వయసుల వారు థియేటర్‌లలో వీక్షించవచ్చు. ఇప్పటివరకు చిత్రబృందం కేవలం టైటిల్ వీడియోతో పాటు 3 నిమిషాల 3 సెకన్ల నిడివి గల 'రామాయణ: ది ఇంట్రడక్షన్' అనే క్లిప్‌ను మాత్రమే పంచుకుంది. భారీ వీఎఫ్ఎక్స్ హంగులతో కూడిన ఆ వీడియోలో శ్రీరాముడిగా రణబీర్ కపూర్, రావణుడిగా కన్నడ స్టార్ యష్ లుక్‌లకు సంబంధించిన ఫస్ట్ లుక్‌లను చూపించారు. అయితే ఇప్పుడు రాబోతున్న టీజర్ ఎలా ఉండబోతుందని అందరూ ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నారు. ఇక ఈ దృశ్యకావ్యం 2026 నవంబర్‌లో దీపావళి కానుకగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# మహాలక్ష్మి పథకంతో ఆర్థిక స్వావలంబ

### కలెక్టర్ గరిమ అగ్రవాల్.
### పలువురు మహిళలకు ఉచిత బస్సు టికెట్ అందించిన కలెక్టర్.



సిరిసిల్ల, మార్చి- 31. జనత న్యూస్.ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణంతో మహిళల భద్రతకు భరోసా ఇవ్వడంతోపాటు ఆర్థిక స్వావలంబనకు ఉపయోగ పడుతుందని కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు.హాప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించి రెండేండ్లకుపైగా పూర్తి అయి 290 కోట్ల ప్రయాణాలు మహిళలు చేయగా, రూ.10 వేల కోట్లు ఆదా చేసిన సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద ఆర్టీసీ అధికారులు, జిల్లా సంక్షేమ శాఖ అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం వేడుకలు నిర్వహించగా, కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరై పలువురు మహిళలకు ఉచిత బస్ టికెట్ అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఉచిత బస్సు ప్రయాణం సద్వినియోగం చేసుకుంటున్న మహిళలకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా ఆర్టీసీ బస్సుల సేవలు నిత్యం వినియోగిం చుకుంటున్న పలువురు మహిళలు తమ అభిప్రాయాలు తెలిపారు. అనంతరం కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పథకాలు అమలు చేస్తుందని అన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అన్ని పథకాలు, సంక్షేమ ఫలాలు వారి పేరిట, వారికి ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండో రోజు డిసెంబర్ 9వ తేదీ 2023 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తుందని తెలిపారు. మహిళలు ఉచిత బస్సు ప్రయాణం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉచిత బస్సు ప్రయాణంతో ప్రైవేట్ ఉద్యోగాలు, ప్రభుత్వ ఉద్యోగాలు చేసే మహిళలు డబ్బులు ఆదా చేసుకొని, వాటిని పిల్లల చదువు, స్వయం ఉపాధి, పొదుపు వైపు మళ్లిస్తున్నారని తెలిపారు. మహిళల ఆర్థిక ప్రగతికి ఈ పథకం దోహదం చేస్తుందని, బస్సుల్లో మహిళల భద్రతకు భరోసా ఇస్తుందని తెలిపారు.పలు ప్రభుత్వ పథకాలు మహిళల పేరిట రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు వారి పేరిట ఇస్తున్నామని వివరించారు. ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ చేశామని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పన, మరమ్మతు పనులు అమ్మ ఆదర్శ పాఠశాల కింద మహిళా సంఘాలకు అందించామని తెలిపారు. స్కూల్ యూనిఫాం వారితో కుట్టించామని పేర్కొన్నారు.సంఘాల్లోని మహిళలకు రుణ బీమా, ప్రమాద బీమా అమలు చేస్తుందని వెల్లడించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని, ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ సూచించారు.కార్యక్రమంలో డీఆర్డీఓ గీత, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, సిరిసిల్ల, వేములవాడ ఆర్టీసీ డీఎంలు ప్రకాశరావు, శ్రీనివాస్, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, తహసీల్దార్ మహేష్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సిరిసిల్ల పట్టణ మౌలిక సౌకర్యాలకే ప్రాధాన్యం

**జిందం కళ, మున్సిపల్ చైర్పర్సన్.**

**మున్సిపల్ అంచనా బడ్జెట్ 57. 21 కోట్లు.**



సిరిసిల్ల. మార్చ్ 31. జనత న్యూస్.సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని మౌలిక సమస్యల పరిష్కారం కోసం ప్రాధాన్యత ఇస్తున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ జిదం కళ తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సాధారణ సమావేశంలో 57. 21 కోట్లు తో అంచనా బడ్జెట్ రూపొందించి ఏకగ్రీవంగా ఆమోదించినట్టు తెలిపారు. సమావేశానికి జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ హాజరయ్యారు. రానున్న వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని ప్రధాన మురికి కాలువ మరమ్మతుల కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయింపు చేశారు. విలీన ప్రాంతాల అభివృద్ధి పై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలిపారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని ప్రజల అవసరాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకొన్నట్లు తెలుస్తోంది. సమావేశంలో వైస్ చైర్మన్ దార్ల సందీప్ తో పాటు మున్సిపల్ కమిషనర్ సంబంధిత అధికారులు పలు వార్డుల కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రమాదాన్ని పసిగట్టాడు.. అప్రమత్తం చేశాడు.

**రాజన్న సిరిసిల్ల జిల్లాలో హోంగార్డ్ ఆదర్శం.**



సిరిసిల్ల. మార్చ్ 31. జనత న్యూస్. ముందుగానే ప్రమాదాన్ని పసిగట్టి అధికారులను, ప్రజలను అప్రమత్తం చేసిన ఓ హోంగార్డు సాహసోపేతంగా వ్యవహరించిన తీరు ఆదర్శంగా నిలుస్తోంది. వివరాల్లోకి వెళితే రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండల కేంద్రంలో సోమవారం రాత్రి సమయంలో బలంగా విచిన గాలులకు హై టెన్షన్ విద్యుత్ వైర్లు తెగి సిరిసిల్ల సిద్దిపేట్ ప్రధాన రహదారిపై తెగిపడ్డాయి. అదే సమయంలో విధి నిర్వహణలో భాగంగా పెట్రోలింగ్ లో ఉన్న హోంగార్డ్ తేజ డీఎస్పీ తో పాటు సంబంధిత శాఖ అధికారులకు సమాచారం అందించారు. అధికారులను అప్రమత్తం చేశారు. ఏలాంటి ప్రమాదం జరగకుండా అధికారులను అప్రమత్తం చేసిన హోంగార్డ్ తేజ ను పలువురు అభినందించారు. సమయ స్ఫూర్తితో వ్యవహరించి అటు అధికారులను వాహనదారులను అప్రమత్తం చేసిన హోంగార్డ్ తేజ ఆదర్శంగా నిలుస్తున్నారు.చేస్తున్న వృత్తి పట్ల అంకితభావంతో ప్రజల ప్రాణాలను కాపాడవలసిన బాధ్యత తో తాను వ్యవహరించినట్లు హోంగార్డ్ తేజ తెలుపుతున్నారు.

## స్వచ్ఛ హుస్నాబాద్‌గా తీర్చిదిద్దుదాం

**మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి పిలుపు**



హుస్నాబాద్,జనత న్యూస్: పట్టణ ప్రజలందరూ తడి, పొడి చెత్తను విడివిడిగా వేరు చేసి మున్సిపల్ వాహనాలకే అందించాలని, స్వచ్ఛ హుస్నాబాద్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి కోరారు.మంగళవారం పట్టణంలోని 11వ వార్డులో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన చెత్త విభజన అవగాహన సదస్సుకు ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు.ప్రజలు చెత్తను బహిరంగ ప్రదేశాల్లో లేదా డ్రైనేజీల్లో వేయకూడదని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం ద్వారా ఆరోగ్యాలను కాపాడుకోవాలని సూచించారు.ముఖ్యంగా ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ, ప్లాస్టిక్ కవర్లు మరియు ప్లేట్ల వినియోగం వల్ల భూసారం తగ్గి భూకాలుష్యం ఏర్పడటమే కాకుండా క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టీల్ బ్యాంకులను ప్రజలు వినియోగించుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.హుస్నాబాద్ పట్టణాన్ని స్వచ్ఛతలో అగ్రస్థానంలో నిలపడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పద్మ, వార్డు కౌన్సిలర్ పూదరి వరప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, పర్యావరణాధికారి రవికుమార్, వార్డ్ ఆఫీసర్ శారద, ఆశ వర్కర్లు, ఆర్పీ స్వర్ణలత, జవాన్ ప్రభాకర్, ఇతర పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

## లేగ దూడపై హైనా దాడి

తిమ్మాపూర్, జనతా న్యూస్ : లేగ దూడ పై హైనా దాడి చేసిన సంఘటన కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నేదునూరు గ్రామంలో చోటుచేసుకుంది. నేదునూరు గ్రామానికి చెందిన కవ్వంపల్లి రవి ఆవుతోపాటు లేగ దూడను తన పొలం దగ్గర కట్టివేసి ఇంటికి వచ్చాడు. ఉదయం వెళ్లి చూడగా సోమవారం రాత్రి లేగ దూడపై గుర్తు తెలియని జంతువు దాడి చేసి చంపి వేయడంతో వెంటనే రవి ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించాడు. సంఘటన స్థలానికి ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శేఖర్ చేరుకొని దాడి చేసిన జంతువు హైనాగా గుర్తించారు. రాత్రి వేళల్లో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఫారెస్ట్ ఆఫీసర్ సూచించారు. లక్ష్మీదేవి పల్లి, గ్రామ ఉపసర్పంచ్ జగన్ రెడ్డి మాట్లాడుతూ లక్ష్మీదేవిపల్లి, నేదునూర్ గ్రామాలలో పశువులపై గుర్తుతెలియని జంతువులు దాడి చేసిన సంఘటనలు తరచు జరుగుతున్నాయని ప్రజలు, రైతులు భయాందోళనకు గురవుతున్నారని, ఫారెస్ట్ అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు.



## ప్రభుత్వ ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



జనత న్యూస్ బెజ్జంకి : బెజ్జంకి ప్రభుత్వ ప్రాథమిక వైద్య కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం స్థానిక సర్పంచ్ బొల్లం శ్రీధర్ పెద్దన్న, డాక్టర్ మాధురి తో కలిసి ప్రారంభించారు. ఈ వైద్య శిబిరానికి మండల ప్రజల నుంచి విశేష స్పందన లభించినట్లు వైద్య అధికారిని మాధురి తెలిపారు. గైనకాలజీ, దంత, కంటి, ఆర్థోపెడిక్, చిన్నపిల్లలు మొదలగు సౌకర్యార్థాలకు జిల్లా కేంద్రం నుంచి నైపుణ్యం కలిగిన డాక్టర్లు వైద్య శిబిరంలో పాల్గొన్నట్లు ఆమె తెలిపారు. అలాగే జనరల్ టెస్టులు బిపి, షుగర్, థైరాయిడ్ వంట టెస్టులు చేసి మందులు పంపిణీ చేసినట్లు డాక్టర్ మాధురి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ బొల్లం శ్రీధర్ పెద్దన్న ప్రాథమిక వైద్యశాలలో ఉన్న వైద్య సిబ్బంది కొరతను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి , మండలం నుంచి జిల్లా కేంద్రానికి డిప్టేషన్ పై వెళ్లిన వారిని తిరిగి బెజ్జంకి రప్పించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఉప సర్పంచ్ దూమాల మహేష్ , వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## తడిసిన మొక్కజొన్నలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

**బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున రెడ్డి డిమాండ్**

**హుస్నాబాద్ మార్కెట్ యార్డ్ వద్ద రైతుల నిరసన**



హుస్నాబాద్,జనత న్యూస్: నిన్న కురిసిన అకాల వర్షంతో మార్కెట్ యార్డులో ఆరబోసిన మొక్కజొన్నలు తడిసిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వం తక్షణమే స్పందించి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ హుస్నాబాద్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మార్కెట్ కమిటీ కార్యాలయం ముందు రైతులతో కలిసి ఆయన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సింగిల్ విండో అధికారులకు వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ.. మార్కెట్ యార్డులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి 18 రోజులు గడుస్తున్నా, ఇప్పటి వరకు కేవలం 4 వేల క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేయడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. కొనుగోళ్లు నత్తనడకన సాగుతుండటంతో రైతులు వారాల తరబడి మార్కెట్లోనే వేచి ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.వాతావరణం అనుకూలించడం లేదని తెలిసినప్పటికీ, అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే చేతికి వచ్చిన పంట వర్షార్పణమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తడిసిన ప్రతి గింజను ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేసి, నష్టపోయిన రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.లేనిపక్షంలో రైతుల పక్షాన పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దొంతబోయిన శ్రీనివాస్, యాస శ్రీనివాస్, మేకల వికాస్ యాదవ్, బత్తుల కొమురయ్య, బొజ్జ హరీష్, కందుకూరు సతీష్, రైతులు పాల్గొన్నారు.

## రోజుకో వాహన సేవలో లక్ష్మీనరసింహుల దర్శనం

**ఆలయ కమిటీ చైర్మన్ జెల్ల ప్రభాకర్ యాదవ్.**



జనత న్యూస్ బెజ్జంకి : మండల కేంద్రంలో గుట్టపై కొలువుదీరిన శ్రీ లక్ష్మీనరసింహుల బ్రహ్మోత్సవాల్లో భాగంగా, జరుగుతున్న జాతర ఉత్సవాలలో స్వామివారు సోమవారం అశ్వ వాహనంపై ఊరేగగా, మంగళవారం సింహవాహనంపై ఆశీనులై బెజ్జంకి పూరవీధులలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు పెద్ద ఎత్తున, స్వామి అమ్మవార్లకు మంగళ హారతులతో స్వాగతం పలికి స్వామివారి కృపకు పాత్రులు అయ్యారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ జెల్ల ప్రభాకర్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతిరోజు , నిత్యం అనేక వాహనాలపై స్వామి అమ్మవార్లు దర్శనమిస్తారని, ఏప్రిల్ 2 గురువారం శకటోత్సవం ( గుట్ట చుట్టూ బండ్లు తిరుగుట) కార్యక్రమానికి ఆలయ కమిటీ మరియు గ్రామపంచాయతీ వారి సహకారంతో అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు తెలిపారు.

# కరీంనగర్ మున్సిపల్ బడ్జెట్‌కు ఏకగ్రీవ ఆమోదం





కరీంనగర్, మార్చి 31: కరీంనగర్ నగరపాలక సంస్థ 2026--27 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌కు సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదం లభించింది. మేయర్ కొలగాని శ్రీనివాస్ అధ్యక్షతన, కమీషనర్ ప్రఫుల్ దేశాయ్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు సమక్షంలో జరిగిన సమావేశానికి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉదయం తెలంగాణ రాష్ట్ర గీతంతో ప్రారంభమైన సమావేశం జాతీయ గీతంతో ముగిసింది. రూ.312.42 కోట్ల బడ్జెట్‌తో పాటు 11 ఎజెండా అంశాలకు పాలకవర్గ సభ్యులు ఆమోదం తెలిపారు. బడ్జెట్‌లో పారిశుధ్యం, ఉద్యోగుల జీతాలు, రుణ వాయిదాలు, మౌలిక సదు-పాయాల అభివృద్ధికి నిధులు కేటాయించారు. ముఖ్యంగా విలీన గ్రామాలు, అభివృద్ధి చెందని ప్రాంతాలు, బలహీన వర్గాల ప్రాంతాలకు ప్రాధాన్యతనిస్తూ 1/3 నిధులను కేటాయించారు. మిగిలిన నిధులను వార్డుల అభివృద్ధి పనులకు వినియోగించనున్నారు. సర్వసభ్య సమావేశంలో జీరో అవర్ సందర్భంగా సభ్యులు పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, ప్లాస్టిక్ నివారణ, వీధి కుక్కలు, ఎంక్రోచ్‌మెంట్, పార్కుల నిర్వహణ తదితర సమస్యలను ప్రస్తావించారు. వాటిపై మేయర్, కమీషనర్ వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ నగరాన్ని రాష్ట్రంలో ఆదర్శ నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. ప్రతి డివిజన్‌కు రూ.10 లక్షల చొప్పున 66 డివిజన్లకు రూ.6.60 కోట్లు కేటాయించామని చెప్పారు. అదనంగా 50 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. పారిశుధ్యం మెరుగుదలకు ప్రతి డివిజన్‌కు ఆటో రిక్షాలు, వీధి దీపాల ఏర్పాటు, నీటి లీకేజీల నివారణ, కుక్కల నియంత్రణ చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. నగరాన్ని స్మార్ట్, క్లీన్, గ్రీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు పాలకవర్గం కృషి చేస్తుందని తెలిపారు. పార్టీలకు అతీతంగా కేంద్ర, రాష్ట్ర నిధులను సమీకరించి నగర అభివృద్ధి చేపడతామని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని మేయర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో పాలకవర్గ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



# ప్రజా పాలన ప్రతిబింబించేలా గ్రామసభలు నిర్వహించాలి: డిప్యూటీ సీఎం






కరీంనగర్, మార్చి 31: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రజలకు స్పష్టంగా ప్రతిబింబించేలా గ్రామసభలను నిర్వహించాలని డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం అమలుపై సీఎస్ కే. రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. కరీంనగర్ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ గ్రామసభల్లో అందించే సమాచారం ఒకే విధంగా ఉండాలని, ప్రభుత్వ ఉద్దేశాలను ప్రజలకు పూర్తిగా తెలియజేయాలని సూచించారు. గ్రామసభలను ముఖ్యమంత్రి సందేశంతో ప్రారంభించి, వివిధ పథకాల లబ్ధిదారుల వివరాలను గ్రామంలో చదివి వినిపించాలని అన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం సరఫరా, గిరిజన రైతులకు ఉచిత పంపు సెట్లు వంటి పథకాల లబ్ధిని ప్రజలకు వివరించాలని సూచించారు. జూన్ 2 నుంచి అమలు కానున్న ఇందిరమ్మ జీవిత బీమా పథకం, పాఠశాలల్లో అల్పాహార కార్యక్రమంపై కూడా అవగాహన కల్పించాలని తెలిపారు. సాంస్కృతిక శాఖ కళాకారులను వినియోగించి ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని, ప్రజలలో ప్రభుత్వంపై విశ్వాసం పెంచేలా అధికారులు పని చేయాలని పేర్కొన్నారు. గ్రామాలకు విడుదలైన నిధులను అభివృద్ధి పనులకు వినియోగించాలని సూచించారు. సీఎస్ కే. రామకృష్ణారావు మాట్లాడుతూ మార్చి 6 నుంచి 15 వరకు నిర్వహించిన కార్యక్రమాలకు మంచి స్పందన లభించిందని,

అదే ఉత్సాహంతో ఏప్రిల్ 2న గ్రామసభలను విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు. గ్రామ-సభలపై నివేదికలను సమర్పించాలని, ప్రజల భాగస్వామ్యం పెంచాలని సూచించారు. గ్రామసభల్లో సంక్షేమ పథకాలతో పాటు వ్యవసాయంలో నూతన పద్ధతులు, పంట మార్పిడి, ఆర్గానిక్ వ్యవసాయం వంటి అంశాలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. మున్సిపాలిటీల్లో వార్డు సభలను కూడా నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో శ్రీనివాస్, డీపీఓ జగదీశ్వర్, డీఆర్‌డీఓ శ్రీధర్, వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మహాలక్ష్మి పథకం మహిళల సాధికారతకు బలమైన వేదిక: కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్, మార్చి 31: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం జిల్లాలో విజయవంతంగా కొనసాగుతూ మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతోందని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. ఆర్టీసీలో మహాలక్ష్మి పథకం ద్వారా 290 కోట్ల ఉచిత ప్రయాణం నమోదు కావడంతో కరీంనగర్ బస్ స్టాండ్‌లో మంగళవారం సాయంత్రం నిర్వహించిన అభినందన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉచిత ఆర్టీసీ ప్రయాణం మహిళలకు ఒక వరంగా మారిందని, ఉపాధి, విద్య, వైద్యం వంటి రంగాల్లో అవకాశాలను సద్వినియోగం చేసుకునేందుకు ఈ పథకం దోహదపడుతోందన్నారు. గ్రామ గ్రామానా ఈ పథకంపై విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 6.91 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించి సుమారు రూ.308.84 కోట్ల ప్రయోజనం పొందినట్లు తెలిపారు. మహిళల ఆర్థిక అభివృద్ధిలో ఈ పథకం కీలక పాత్ర పోషిస్తున్నదన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళా ప్రయాణికులను అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్, ఆర్డీవో మహేశ్వర్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, మెప్మా పీడీ స్వరూప రాణి, ఆర్టీసీ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పగిడిమర్రి సోలోమన్, రీజినల్ మేనేజర్ బి.రాజు, డిప్యూటీ రీజినల్ మేనేజర్లు మల్లేశం, భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత ప్రయాణం వల్ల డబ్బు ఆదా అవుతూ కుటుంబ అవసరాలకు ఉపయోగపడుతోందని, విద్య, ఉపాధి అవకాశాలను సులభంగా అందిపుచ్చుకునే అవకాశం కలుగుతోందని తెలిపారు. మహిళల ఆర్థిక అభివృద్ధికి, సాధికారతకు ఈ పథకం దోహదపడుతోందని పేర్కొన్నారు.

## గ్రామసభలు విజయవంతానికి అధికారుల సమన్వయం అవసరం: కలెక్టర్ చిత్రా మిశ్రా



కరీంనగర్, మార్చి 31: ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 2న నిర్వహించే గ్రామసభలను విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులంతా సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ తన ఛాంబర్‌లో జిల్లా స్థాయి అధికారులతో గ్రామసభల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామసభలు ప్రశాంత వాతావరణంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా, ఇందిరమ్మ పథకం, మహాలక్ష్మి, ఆరోగ్యశ్రీ, సన్నబియ్యం, రేషన్ కార్డుల పంపిణీ వంటి పథకాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని తెలిపారు. అలాగే కొత్తగా ప్రవేశపెట్టే ఇందిరమ్మ జీవిత బీమా పథకం గురించి కూడా వివరించాలని ఆదేశించారు. గ్రామసభల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చూడాలని, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పకడ్బందీ ప్రణాళికతో గ్రామసభలను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీకిరణ్, ఆర్డీవో మహేశ్వర్, డీపీఓ జగదీశ్వర్, జెడ్పీ సీఈవో శ్రీనివాస్, గృహనిర్మాణ శాఖ పీడీ శ్రీనివాసు, సంక్షేమ అధికారి సరస్వతి, వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# చామనపల్లి హత్య కేసులో 15 మందికి యావజ్జీవ కారాగార శిక్ష



కరీంనగర్, మార్చి 31: కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చామనపల్లి గ్రామంలో జరిగిన బోజ్జ తిరుపతి హత్య కేసులో 15 మంది నిందితులకు జిల్లా ప్రధాన మరియు సెషన్స్ కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ సంచలన తీర్పు వెలువరించింది. ప్రతి నిందితుడికి రూ.1,500 జరిమానా కూడా విధించింది.

కేసు వివరాలు: 2019 ఏప్రిల్ 19న చామనపల్లి గ్రామ పొలిమే-రలో ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామ మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడిగా ఉన్న బోజ్జ తిరుపతి (48) చేపల వేటకు సంబంధించి నిందితులను సభ్యత్వం నుంచి తొలగించడంతో కక్ష పెంచుకున్న నిందితులు పథకం ప్రకారం రాళ్లతో దాడి చేసి, తువాలుతో గొంతు నులిమి హత్య చేశారు. మృతుడి భార్య బోజ్జ సమత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

శిక్ష పడిన వారు: మయాకల ధర్మరాజం, మయాకల రాములు, మయాకల పోచయ్య, మయాకల కొమురయ్య, మయాకల అంజయ్య, మయాకల వెంకటేశం, మయాకల నవీన్, మయాకల ప్రవీణ్, మయాకల శ్రీనివాస్ (కొమురయ్య కుమారుడు), మయాకల శ్రీనివాస్ (రాములు కుమారుడు), మయాకల సంపత్, మయాకల లచ్చయ్య, మయాకల సత్తయ్య, మయాకల శ్రీనివాస్ (వెంకటేశం కుమారుడు), మయాకల వెంకట్రాజం.

పోలీసుల కృషి: కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసిన నాటి కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ కె. శశిధర్, ప్రస్తుత ఎస్‌హెచ్‌ఓ ఏ. నిరంజన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం. ప్రతాప్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ ఎన్. రాజేందర్, సి.ఎం.ఎస్ ఏఎస్ఐ ఎం. సత్తయ్యలను పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు.

శాస్త్రీయ ఆధారాలు, బలమైన సాక్ష్యాలను కోర్టు ముందు సమర్పించడం వల్లే నిందితులకు కఠిన శిక్షలు పడేలా చేయగలిగామని, నేరస్తులకు శిక్షలు పడేలా పోలీసు యంత్రాంగం నిరంతరం కృషి చేస్తుందని సీపీ తెలిపారు.

# రైతుల సంక్షేమమే సహకార సంఘాల లక్ష్యం

**అర్ధ వార్షిక మహాజన సభలో పర్సన్ ఇన్‌ఛార్జ్ వనజ**




చిగురుమామిడి,జనత న్యూస్: రైతుల ఆర్థికాభివృద్ధి, ప్రయోజనాలే లక్ష్యంగా వ్యవసాయ సహకార సంఘాలు పని చేస్తున్నాయని సింగిల్ విండో కార్యాలయ పర్సన్ ఇన్‌ఛార్జ్ డి. వనజ అన్నారు. చిగురుమామిడి మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన వ్యవసాయ సహకార పరపతి సంఘం అర్ధ వార్షిక సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. మండలంలోని వందలాది మంది రైతులు ఈ సంఘం ద్వారా వివిధ రకాలుగా లబ్ధి పొందుతున్నారని, సభ్యుల నుంచి రూ. 63.37 లక్షల దీర్ఘకాలిక రుణాలను వసూలు చేయడంతో పాటు, రైతులకు రూ. 55.40 లక్షల రుణాలను పంపిణీ చేసినట్లు వివరించారు.సంఘం ద్వారా కేవలం రుణాలకే పరిమితం కాకుండా ఎరువుల విక్రయాలు, పెట్రోలు, డీజిల్ వ్యాపారం, ధాన్యం సేకరణ కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు వనజ తెలిపారు. ఎరువుల విక్రయం ద్వారా రూ. 82.59 లక్షలు, పెట్రోల్ మరియు డీజిల్ వ్యాపారం ద్వారా రూ. 5.02 కోట్లకు పైగా టర్నోవర్ సాధించామని వెల్లడించారు. అలాగే 2025-26 సీజన్‌కుగాను ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి 1.35 లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించినట్లు పేర్కొన్నారు. రైతుల సహకారం ఉంటే భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. అనంతరం సీఈవో నర్సయ్య సంఘం అర్ధ వార్షిక నివేదికను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ చైర్మన్ చిట్టిమల్ల శ్రీనివాస్, కార్యాలయ సిబ్బంది కుమార్, పవన్, లింగయ్య, శ్రీనివాస్, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# రథోత్సవంతో రాములోరీ జాతర ముగింపు

**దాచారం సర్పంచ్ బైరా మానస రాజేందర్.**



జనత న్యూస్ బెజ్జంకి : మండలంలోని దాచారం గ్రామంలో రాముల వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవం ఘనంగా జరిగింది. రథోత్సవం గ్రామ పూరవీధుల గుండా , భక్తిశ్రద్ధలతో కొనసాగింది, గ్రామ వీధులలో మహిళలు మంగళ హారతులతో సీతారాములను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బైర మానస రాజేందర్ మాట్లాడుతూ, రాముల వారి ఉత్సవాలు ప్రతి సంవత్సరం శ్రీరామనవమి రోజు సీతారాముల కళ్యాణ ఘట్టంతో మొదలై, పట్టాభిషేకం, శకతోత్సవం, అన్నప్రసాద వితరణ వంటి కార్యక్రమాలు గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్తుల సహకారంతో విజయవంతమైందని సంతోషం వ్యక్తం చేశారు. సీతారాముల బ్రహ్మోత్సవాలు రథోత్సవంతో ముగిసింది అని పేర్కొన్నారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com